
శ్రీ మధ్వాచార్య

(జీవిత విశేషాలు, సిద్ధాంతం - సంక్షిప్తంగా)



కళానిధి సత్యనారాయణ మూర్తి

శ్రీ వేదభారతి

ఓం శ్రీ వేంకటనాథాయనమః

శ్రీమధ్వాచార్య

(జీవిత విశేషాలు, సిద్ధాంతం - సంక్షిప్తంగా)

కళానిధి సత్యనారాయణ మూర్తి

విశ్రాంత న్యాయశాఖ కార్యదర్శి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

సంపాదకుడు

"సంస్కృత మిత్ర"

డా॥ రేమెళ్ళ అవధానులు,

M.Sc. (Nuclear Physics), M.A., Ph.D (Sanskrit), M.A., Ph.D. (Jyotisha)

Dy. Director (Computers), (Retd)., NIMS, Hyderabad.

శ్రీ వేదభారతి

హైదరాబాదు

2013

శ్రీమధ్వాచార్య

(జీవిత విశేషాలు, సిద్ధాంతం-సంక్షిప్తంగా)

కళానిధి సత్యనారాయణ మూర్తి

ప్రథమ ముద్రణ : అక్టోబర్, 2013

వెల : **రూ. 25/-**

ప్రతులకు :

1. శ్రీ వేదభారతి
H-34, Madhuranagar, Hyderabad-500 038.
Ph./Fax.: 040-23812577 Cell : 98494 59316
e.mail : shrivedabharathi@gmail.com
www.shrivedabharathi.org
www.shrivedabharathi.in

2. Sri K.S.N. Murthy,
D-118, Madhuranagar,
Hyderabad - 500 038.
Ph : 040-23810590
Cell : 94902 95269

ముద్రణ :
Samhitha Graphics
Ameerpet, Hyderabad - 500016.
Ph.: 040-23731620, 23741620

కృతజ్ఞతలు

ఈ పుస్తకప్రచురణకు ఆర్థికసహాయం అందించిన
ప్రియమిత్రులు
శ్రీ కోనరామమోహనరావు గారు & శ్రీమతి విజయ
దంపతులకు
(సీనియర్ కంప్యూటర్ ప్రొఫెషనల్)
కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారికి, వారి కుటుంబ
సభ్యులకు పరమేశ్వరుడు పరిపూర్ణ అనుగ్రహమును
ప్రసాదించుగాక అని ప్రార్థిస్తున్నాము.

డా॥ రేమెళ్ళ అవధానులు,
శ్రీ వేద భారతి

విజయ "విజయ దశమి"

13.10.2013

ఓం శ్రీ వేంకటనాథాయనమః

శ్రీమధ్వాచార్య

(జీవిత విశేషాలు, సిద్ధాంతం-సంక్షిప్తంగా)

విషయ సూచిక

2వ అధ్యాయం

మా ధ్యేయం

శ్రీ ఆదిశంకరుల అద్వైతం, శ్రీ రామానుజుల విశిష్టాద్వైతం, శ్రీ మధ్వుల ద్వైతం ప్రసిద్ధమైన సిద్ధాంతాలు. ఈ మూడు సిద్ధాంతాలకు అనుయాయులు గణనీయంగానే ఉన్నారు. అయితే ఈ అనుయాయులలో చాలా మందికి 'నేనీ సిద్ధాంతానికి చెందిన వాడను' అని తెలుసునే తప్ప, తమ తమ సిద్ధాంతాలలోని మౌలికాంశాలు గాని, తమ సిద్ధాంతం ఇతర సిద్ధాంతాలోని ఏయే విషయాలతో ఏకీభవిస్తుంది, లేక విభేదిస్తుంది అనే విషయాల మీద గాని అవగాహన లేదు. ఇది యాంత్రిక జీవితం వల్ల, తెలుకోవాలనే ఆకాంక్ష లేక పోవడం వల్ల, ఈ సిద్ధాంతాల మీద గ్రంథాలు జటిలంగా ఉండడం వల్ల సంభవించింది. సిద్ధాంతకర్తల జీవిత విశేషాలు కూడా చాలా మందికి తెలియవు. ఇది సామాన్యుల పరిస్థితి. జిజ్ఞాసతో అధ్యయనం చేసే వారికి, పండితులకు చెప్పవలసిందేమీ లేదు.

అలాంటి సామాన్యులకు, ముఖ్యంగా జిజ్ఞాస ఉన్నా విపులమైన, జటిలమైన గ్రంథాలను అధ్యయనం చేయడానికి సమయం లేనివారికి, వారి వారి సిద్ధాంతాల మీద కనీస అవగాహన కలిగించాలనే ఉద్దేశ్యంతో శ్రీవేదభారతి 'శ్రీ ఆదిశంకరాచార్య', 'భగవద్రామానుజాచార్య', 'శ్రీ మధ్వాచార్య' అనే మూడు చిన్ని పుస్తకాలను ప్రచురించింది. సంక్షిప్తంగా ఆయా సిద్ధాంత కర్తల జీవిత విశేషాలను, సిద్ధాంతాలను కేవలం పరిచయం చెయ్యడమే ఈ చిన్ని పుస్తకాల ధ్యేయం. వీటిని చదివిన తరువాత ఆయా సిద్ధాంతానికి చెందిన వారు ప్రభావితులై వారి వారి ఆచార్యుల జీవిత చరిత్రలను, సిద్ధాంతాలను సమగ్రంగా అధ్యయనం చేస్తారని ఆకాంక్షిస్తూ...

ప్రకాశకులు

ఓం శ్రీ వేంకటనాథాయనమః

శ్రీమధ్వాచార్య

1వ అధ్యాయం

1. బాల్యం-విద్యాభ్యాసం

మన ప్రాచీన మహర్షులు వేదాలను, వాటిలోని అంతర్భాగాలైన ఉపనిషత్తులను దర్శించి వాటిని లోకోపకార బుద్ధితో, తమ శిష్య ప్రశిష్యుల ద్వారా, సంప్రదాయబద్ధంగా, తర్వాతి యుగాల వారికి అందించారు. ఆ పరంపరలోనే ఈ యుగంలో అవతరించిన త్రిమతాచార్యులు ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీతలను విభిన్న మార్గాలలో విశ్లేషించి, కొన్ని సిద్ధాంతాలను తర్వాతి తరాల వారికి అనుగ్రహించి నిష్క్రమించారు. ఈ మహానుభావులందరికీ మనం వృద్ధిలోనికి రావాలనే ఆకాంక్ష తప్ప, వ్యక్తిగతమైన కీర్తి కాంక్ష లేదు. అందుచేతనే వారు ఏ కాలానికి చెందినవారో, వారి జీవిత విశేషాలేమిటో మనకు చెప్పలేదు. ఈ కారణంగానే వారి కాలనిర్ణయం ఇదమిద్ధంగా ఎవ్వరూ చెయ్యలేకపోయారు.

శ్రీ మధ్వాచార్యుల వారి గురించి తెలుసుకోవడానికి, కొంచెమించుమించు వారికి సమకాలికులైన శ్రీ నారాయణ పండితాచార్యులు రచించిన 'మధ్వవిజయ' మనే గ్రంథం ఒకటే ఆధారం. అయితే ఈ గ్రంథం శ్రీ మధ్వుల సంచారానికి సంబంధించిన విశేషాలు, ఇతర విషయాలమీద సమాచారం ఇస్తుందిగాని శ్రీ మధ్వులు ఎప్పుడు జన్మించారనే విషయం మీద

సమాచారం ఇవ్వలేదు. చివరకు అనేక ఆధారాలను పరిశీలించి శ్రీమధ్వుల జీవితకాలం 1238-1317 గా కొన్ని జీవిత చరిత్రలలో వ్రాశారు. అయితే ఈ విషయంలో వివాదం ఉంది.

భారతదేశ పశ్చిమ తీరంలోని మలబారు, కనరా ప్రాంతాలు ప్రకృతి రమణీయతకు ప్రసిద్ధం. ఆ ప్రాంతాన్ని పరశురామక్షేత్రం అంటారు. ఈ ప్రదేశంలోనే ఉడుపి క్షేత్రం ఉంది. దీని దగ్గరలో గల 'పాజకక్షేత్రం' అనే పల్లెటూరులో శ్రీమధ్వులు మధ్యగేహ భట్టు, వేదవతి దంపతులకు క్రీ.శ. 1238 సం॥లో జన్మించారు. శ్రీమధ్వులు వాయుదేవుని అవతారం అంటారు. తల్లిదండ్రులు అతనికి 'వాసుదేవ' అని నామకరణం చేశారు. ఎనిమిదవ ఏట ఉపనయనం చేశారు. ఈయన మహాబలశాలి, బాలమేధావి.

ప్రథమో హనుమన్నామ ద్వితీయో భీమ ఏవచ ।
పూర్ణప్రజ్ఞస్తృతీయస్తు భగవత్కార్యసాధకః ॥

భగవత్కార్య నిర్వహణలో వాయుదేవుల వారి ప్రథమావతారం హనుమంతుడు, రెండవ అవతారం భీమసేనుడు కాగా మూడవ అవతారం పూర్ణప్రజ్ఞులు అని మహాభారత తాత్పర్య నిర్ణయంలో ఉంది.

శ్రీమధ్వులు అచ్యుతప్రేక్ష అనే అద్వైత పండితుల వద్ద విద్యాభ్యాసానికి చేరారు. కాని ఒక తమ్ముడు జన్మించిన తరువాత, 11 లేక 12వ ఏటనే తల్లి అనుమతితో సన్యసించారు. పూర్ణప్రజ్ఞులుగా ప్రసిద్ధి పొందారు. చిన్నతనంలోనే వాసుదేవుడనే మహాపండితుణ్ణి

వాదంలో ఓడించారు. అచ్యుతప్రేక్షుల ఆశ్రమం విడిచి చిన్న మఠం స్థాపించుకున్నారు. మఠాధిపతిగా అచ్యుతప్రేక్షులే పట్టాభిషేకం చేసి ఆనందతీర్థులనే నామకరణం చేశారు. అనేక శాస్త్రాల మీద మఠంలో చర్చలు జరిగేవి. షడ్దర్శనాలలోను, తర్కంలోను మహాపండితుడుగా ప్రఖ్యాతి గాంచారు. మొదటి నుండి శంకరాద్వైతానికి వ్యతిరేకంగా వాదించడం మొదలు పెట్టారు. దీనికి కారణం భక్తి ప్రధానమైన శ్రీమద్భాగవతం మీద మక్కువకావచ్చు. గురువు అచ్యుతప్రేక్షులు కూడా పూర్ణప్రజ్ఞులతో ఏకీభవించేవారు.

2. దక్షిణదేశయాత్ర

శ్రీ మధ్వులు మొదట దక్షిణదేశ యాత్ర సాగించారు. ఆ రోజులలో విజయనగర సామ్రాజ్యం ఉచ్చదశలో ఉంది. దక్కను పీఠభూమికి మహ్మదీయుల రాజ్యం విస్తరించకుండా విజయనగర రాజులు అడ్డుకున్నారు గాని అవకాశం చిక్కినప్పుడెల్లా మహ్మదీయుల దాడులు జరుగుతూనే ఉండేవి. శ్రీ మధ్వులు విష్ణుమంగళం అనే ఊరు చేరుకున్నారు. అక్కడ ఆయన యోగశక్తులను పరీక్షిద్దామని ఒక గృహస్థు వారిని భిక్షకు ఆహ్వానించి షడ్రసోపేతంగా భోజనం పెట్టిన పిదప రెండు వందల అరటిపళ్ళు ముందర పెట్టి ఆరగించమన్నాడట. శ్రీ మధ్వులు అవలీలగా రెండువందల అరటిపళ్ళను ఆరగించి అందరిని ఆశ్చర్యపరిచారట. దారిలో అనేకమంది పండితులను వాదంలో ఓడిస్తూ, క్రమంగా పూర్ణప్రజ్ఞులు తిరువనంతపురం మీదుగా కన్యాకుమారి చేరారు. అక్కడ

కన్యాకుమారిని సేవించి, రామేశ్వరం చేరుకుని చాతుర్మాస్య వ్రత దీక్ష స్వీకరించారు. కుజిపుస్తూరుడనే విద్వాంసుణ్ణి వాదంలో ఓడించారు. చాతుర్మాస్యవ్రతం పూర్తిచేసుకుని మరొక మార్గం ద్వారా ఉడుపికి బయలుదేరారు. దారిలో శ్రీరంగంలో కావేరీ స్నానం చేసి శ్రీరంగనాథుణ్ణి సేవించుకున్నారు. శ్రీమూష్ణం అనే ఊళ్ళో గర్భవతియైన ఒక స్త్రీ, యింటికి నీరు తెచ్చుకోవడానికి కష్టపడుతుండడం చూసి, జాలిపడి తన దండంతో ఒక చెరువును సృష్టించారట. దానికి దండతీర్థం అనిపేరు. దారిలో పాయస్విని నదీతీరంలో గల వరాహస్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఉడుపికి తిరిగి వచ్చారు. అనేక చోట్ల జరిగిన పండిత సభలలో ఐతరేయోపనిషత్తు మీద, విష్ణుసహస్రనామస్తోత్రం మీద ప్రవచనాలు చేశారు. విష్ణుసహస్రనామానికి వంద అర్థాలున్నాయని నిరూపించారు. ఈ దక్షిణదేశయాత్రతో శ్రీ మధ్వులకు దక్షిణాదిన ఒక వినూత్న ద్వైత సిద్ధాంతకర్తగా పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. చాలమంది అద్వైత పండితులను వాదంలో ఓడించినందువల్ల మధ్వమతంలో చాలమంది చేరటం కూడా జరిగింది. ఈ యాత్రకూడ పెద్ద పరివారంతోనే సాగడం విశేషం.

3. బదరీ యాత్ర

పూర్ణప్రజ్ఞులు ఇప్పటికే గీతాభాష్యం వ్రాశారు. బ్రహ్మసూత్ర భాష్యం కూడా తొందరగా వ్రాయాలని సంకల్పించారు. అయితే ముందుగా హిమాలయాల్లో బదరికాశ్రమం అని ప్రసిద్ధి పొందిన

వ్యాసాశ్రమం దర్శించాలనుకున్నారు. వ్యాసులవారు సజీవంగా అక్కడ ఇంకా ఉన్నారని ప్రసిద్ధి. అప్పటికే ఉత్తర భారతం ముసల్మానుల పాలనలోకి వచ్చింది. కీకారణ్యాల గుండా ప్రయాణం చెయ్యడం సాహసకృత్యం. అయినా పూర్ణప్రజ్ఞులు కొంత పరివారంతో బదరికాశ్రమానికి బయలుదేరారు. వృద్ధాప్యం వల్ల అచ్యుతప్రేక్షులు అనుసరించలేదు. ఆశీర్వదించి పంపించారు. ముందుగా కాశీ చేరి గంగాస్నానం ఆచరించి హిమవన్నగ శిఖరాలలో గల నరనారాయణ దేవాలయం చేరుకుని, అచ్చట నుండి ఆనందమఠం దగ్గర బసచేశారు. అక్కడ ఒక రాత్రి ఆయనకు శ్రీ కృష్ణ భగవానుడు దర్శనమిచ్చి ద్వైతపరంగా రచించిన గీతాభాష్యాన్ని ఆమోదించారు. అక్కడ నుండి ఒంటరిగా వ్యాసాశ్రమానికి బయలుదేరారు. సత్యతీర్థుడనే శిష్యుడు ఆయనను అనుసరించడానికి ప్రయత్నం చేసినా, కొంతదూరం వెళ్ళి ముందుకు సాగలేక వెనుదిరగవలసి వచ్చింది. పూర్ణప్రజ్ఞులు మాత్రం వ్యాసాశ్రమం చేరుకుని, వ్యాసదర్శనం చేసుకుని, ఆ ఋషిసత్తముడికి సాష్టాంగం చేశారు. ఆశ్రమంలో కొంతకాలం ఉన్నారు. వ్యాసుల వారు స్వయంగా మహాభారతంలోని అంతరార్థాలను, మూల రామాయణాన్ని, బ్రహ్మసూత్రాలను, పంచరాత్రాగమాలను, వేదాలలోని రహస్యాలను ఉపదేశం చేశారు. ఆనందతీర్థులు తిరుగు ప్రయాణం భారతదేశపు తూర్పుదిశనుండి బెంగాల్, ఒరిస్సా, ఆంధ్ర ప్రాంతాల మీదుగా జరిగింది. గోదావరి తీరంలో శ్యామశాస్త్రి, శోభనభట్టు మొదలైనఅనేక మంది పండితులను జయించగా వారివురు మధ్వమతాన్ని స్వీకరించారు. తరువాత

శ్యామశాస్త్రి నరహరితీర్థగా, శోభనభట్టు పద్మనాభతీర్థులుగా మారి, పేరు ప్రఖ్యాతులు గడించుకున్నారు. ఈ నరహరితీర్ధ దగ్గరనుండే మూలరాముడి విగ్రహం, సీతాదేవి విగ్రహం ఆనందతీర్థులు, వారి అంతర్ధానానికి 3 నెలల 16 రోజులు ముందు సంపాదించారు. ఇవి శ్రీరాముడి కాలం నాటివేనని చెబుతారు. ప్రస్తుతం ఇవి మంత్రాలయంలో పూజింపబడుతున్నాయి.

ఆనందతీర్థులు బ్రహ్మసూత్ర భాష్యం ద్వైతపరంగా వ్రాశారు. ఇది విశేష ప్రశంసలందుకుంది. గురువు అచ్యుతప్రేక్షులు ద్వైతాన్ని అంగీకరించి పురుషోత్తమతీర్థగా మారారు. ఆనందతీర్థులు ఉడుపిలోని శ్రీ కృష్ణ దేవాలయంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి తాను చాల కాలం అక్కడే గడిపారు. ఉడుపి మధ్వుల పుణ్యక్షేత్రంగా మారింది. శ్రీ మధ్వులు మరొకసారి హిమాలయాల్లో వ్యాసదర్శనం చేసుకోవాలని నిశ్చయించుకున్నారు.

4. రెండవసారి బదరీయాత్ర

క్రీ.శ.1260–1271 మధ్య కాలంలో ఆనందతీర్థులు రెండవసారి బద్రీయాత్రకు బయలుదేరారు. మహారాష్ట్రలోని దేవగిరి (ఇపుడు దౌలతాబాదు) రాజ్యం మీదుగా గంగాతీరం చేరుకున్నారు. అక్కడతో హిందూరాజ్యం ఆఖరు. గంగకు ఉత్తరాన అల్లాయుద్దీన్ ఖిల్జీ పరిపాలిస్తున్నాడు. ఏ హిందువు గంగదాటకూడదనే

చండశాసనం చేసి పడవలను నిషేధించాడు. కాని ఆనంద తీర్థులు వాయుదేవుని సహాయంతో శిష్యులందరితో గంగ మధ్యనుండి నడుచుకుంటూ ఆవలి ఒడ్డు చేరారు. సైనికులు అడ్డగించి ఆనందతీర్థులను అల్లాయుద్దీన్ ఖిల్జీ సమక్షంలోనికి తీసుకువెళ్ళారు. అక్కడ ఆనందతీర్థులు పారశీక భాషలో మాట్లాడారు. ఆయన గంభీరమూర్తిని చూడగానే అల్లాయుద్దీన్ గౌరవించి సాదరంగా సాగనంపాడు. దారిలో అనేకమంది బందిపోటు దొంగలను, క్రూరమృగాలను ఎదుర్కోవలసి వచ్చింది. ఆరోజులలో ప్రయాణీకులకు భద్రత ఉండేదికాదు.

ఆనందతీర్థులు రెండవసారి వ్యాసులవారి దర్శనం చేసుకున్నారు. ఆశ్రమవాసులు ఆయన్ను ఎంతో ఆదరించి ఎనిమిది పవిత్రమైన సాలగ్రామాలను బహుకరించారు.

ఆనందతీర్థులు తిరుగుప్రయాణంలో కూడ అనేక కష్టాలను ఎదుర్కొవలసి వచ్చింది. కాని ఆయన మహిమలతో ముందుకు సాగి, హస్తినాపురం, కురుక్షేత్రం, కాశీ దర్శించుకున్నారు. అక్కడ కొంతకాలం ఉన్నారు. తరువాత హృషీకేశం, గోవాలమీదుగా ఉడుపి చేరుకున్నారు. రెండవసారి బదరీయాత్రలో వేదవ్యాసులవారు మహాభారత తాత్పర్యాన్ని వ్రాయమని ఆజ్ఞాపించారు. శిష్యులు యాత్రా విశేషాలను చెప్పుకుంటూంటే విని నారాయణపండితాచార్యులు 'మధ్వవిజయ' మనే గ్రంథాన్ని రచించారు. ఆనందతీర్థులు 'మహాభారత తాత్పర్య నిర్ణయ' అనే ప్రసిద్ధ గ్రంథాన్ని రచించారు. శ్రీ మధ్వులు భారతదేశంలోని ప్రసిద్ధ క్షేత్రాల నన్నింటిని దర్శించుకున్నారని చారిత్రకులు చెప్తారు.

5. ప్రతిఘటనలు

ఉడుపికి చేరువలోనే శృంగేరి శ్రీ శారదా పీఠం ఉంది. ఇది శ్రీ శంకరులు స్థాపించినది. అద్వైత సిద్ధాంత ప్రచారానికి కేంద్రస్థానం. పరిసర ప్రాంతాలలోనూ ఇతర ప్రదేశాలలోనూ కూడా ద్వైతం వ్యాపించడం వారికి కొంత ఇబ్బందికరంగా మారింది. మొదట ద్వైతం శాస్త్ర విరుద్ధమని ప్రచారం చేశారు. లాభం లేక పోవడంతో ముందుగా ద్వైత సిద్ధాంత గ్రంథాలను మాయం చేస్తే సరిపోతుందని కొందరు అనుకున్నారు. ఇద్దరు పండితులను వాదానికి పంపారు. శ్రీ మధ్వులు వారితో వాదించారు. వారు ఓటమిపాలై రాత్రికి రాత్రే నిష్క్రమిస్తూ గ్రంథాలయంలోని అనేక గ్రంథాలనుకూడ అపహరించుకు పోయారు. కాని వారిద్దరిని పట్టుకొని రాజుకు ఫిర్యాదు చేశారు. గ్రంథాలు రాజభటులు స్వాధీనం చేసుకున్నారు. రాజు జయసింహుడు ఆచార్యుల వారి గురించి, వారి సిద్ధాంతాల గురించి విని ముగ్ధుడై ఆస్థానానికి ఆహ్వానించాడు. శ్రీ మధ్వులు రాజాస్థానానికి బయలు దేరారు. దారిలోనే రాజు ఎదురుగా వచ్చి సాష్టాంగపడ్డాడు. గ్రంథాలు మళ్ళీ మఠం గ్రంథాలయానికి చేరాయి. అద్వైతంలో మహా పండితుడు ఆరోజుల్లో త్రివిక్రమాచార్యుడు. ఆయన ద్వైతం స్వీకరించాడు. శ్రీ మధ్వుల సూత్రభాష్యానికి త్రివిక్రమ పండితుడు 'తత్త్వ ప్రదీపిక' అనే పేరుతో వ్యాఖ్యానం రచించాడు. ఈయనతో బాటు అనేకులు అద్వైతులు ద్వైతాన్ని స్వీకరించారు.

ఈ కాలంలోనే శ్రీ మధ్వుల తల్లి తండ్రులు విష్ణు సాయుజ్యం పొందారు. తన తమ్ముడికి శ్రీ మధ్వులు సన్న్యాసదీక్ష ఇచ్చి 'విష్ణు తీర్థ' అని నామకరణం చేశారు.

6. చరమదశ

వాయుదేవుడి అవతారాలే హనుమంతుడు, భీముడు, శ్రీ ఆనందతీర్థులు అని చెప్తారు.అందుచేత వృద్ధాప్యంలో కూడా పూర్ణ ప్రజ్ఞులకు జవసత్వాలూ తగ్గలేదు! మేధస్సు పదునూ తగ్గలేదు! తాను వ్యాసాశ్రమం చేరుకుని అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకుంటానని చెప్తూ ఉండేవారు. తదనుగుణంగానే ఆయన చరమ దశలో బదరి చేరుకుని అక్కడ అంతర్ధానమయ్యారు.

మరికొందరు ఆయన చరమదశలో ఉడుపిలోని అనంతేశ్వరాలయంలో ఐతరేయ ఉపనిషత్తును ఉపదేశిస్తుండగా దేవతలు పుష్పవృష్టి కురిపించారని, ఆపూలలో ఆయన పూర్తిగా కప్పబడి ఆ కుప్పనుండి బయటకు రాకుండా అంతర్ధానమయ్యారని, ఆయన ఇంకా సజీవంగా బదరికా వనంలోని వ్యాసాశ్రమంలో ఉన్నారని అంటారు.

భారతదేశంలో యతిపుంగవులు సిద్ధి నిగూఢంగానే (mysterious) జరుగుతుంది. శంకరులు ఎలా అదృశ్యం అయ్యారో ఎవ్వరికి తెలియదు. ఇది వారి అతీంద్రియ శక్తులకు తార్కాణం. అదే విధంగా వీరి నిష్క్రమణం కూడా!

7. అసామాన్య కార్యం

అద్వైతం, విశిష్టాద్వైతం వేళ్ళూనుకొని ఒకదానితో ఒకటిపోటీ పడతున్న కాలంలో ఈ రెండింటిని కాదని ఒక స్వతంత్రమైన సిద్ధాంతాన్ని ప్రవచించి దాన్ని తన వాదనా పటిమతో జనసామాన్యంలో ఆమోదయోగ్యంగా చెయ్యడం అసామాన్య కృత్యం. దీన్ని తన యోగశక్తితోను, శ్రీమన్నారాయణుడిమీద అచంచల భక్తి విశ్వాసాల తోనూ, తర్కంతోనూ, అసాధారణ పాండిటీ ప్రతిభతోను సాధించి శ్రీ పూర్ణప్రజ్ఞులు ప్రపంచానికి చేసి చూపించారు. ఆయన తన యోగశక్తితో ఎన్నో అద్భుతాలు చేశారు.

బదరి నుండి తిరుగు ప్రయాణంలో ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం, రాయలసీమ మీదుగా ఉడుపి చేరుకున్నారు. ఆయా ప్రాంతాలలో పండిత ప్రకాండులను వాదంలో గెలిచి ద్వైతానికి గుర్తింపు తీసుకువచ్చారు. తత్ఫలితంగా ఒరిస్సా, ఆంధ్ర తీరప్రాంతం, రాయలసీమ, మహారాష్ట్ర, కర్ణాటకలలో మధ్వులు విశేషంగా ఉన్నారు. అలా త్రిమతాచార్యులలో ఒకరుగా శ్రీ ఆనందతీర్థులు పూజింపబడుతున్నారు.

8. ఉడుపి

శ్రీ పూర్ణప్రజ్ఞులు కార్యస్థానం ఉడుపి అని చెప్పాలి. ఒక ఓడ మునిగిపోతూంటే శ్రీ మధ్వులు తన దివ్యశక్తితో రక్షించారు. ఆ ఓడ క్రింద, అది స్థిరంగా ఉండడానికి ఒక పెద్ద గోపి చందనం ముద్ద ఉంచారట. శ్రీ మధ్వులు ఆ ముద్దను బహుమతిగా తీసుకొని

అందులో ఉన్న సుందరమైన కృష్ణ విగ్రహాన్ని సంపాదించారు. ఆ విగ్రహానికి ఆలయం నిర్మించారు. అలా అక్కడ ఆయన శ్రీ కృష్ణ దేవాలయాన్ని స్థాపించి అక్కడ ఎనిమిది మఠాలను స్థాపించారు. ఇది మధ్వుల పుణ్యక్షేత్రంగానే కాక శ్రీకృష్ణ భక్తులందరికి పుణ్యక్షేత్రంగా రూపుదిద్దుకుంది. దీని పాలనా వ్యవస్థకూడా ఆయన పటిష్ఠపరిచారు. ఇప్పటికి ఈ క్షేత్రం అశేష కృష్ణభక్తులతో కళకళలాడుతూ ఉంది.

సాలగ్రామ శిలతో ఈ కృష్ణ విగ్రహాన్ని దేవ శిల్పియైన విశ్వకర్మ చెక్కాడని అంటారు. కనకదాసు అనే శ్రీ కృష్ణ భక్తుడు పంచముడైనందువల్ల దర్శనానికి అతనికి అనుమతి ఇవ్వకుండా ప్రక్కకు నిలబెట్టారట. అతను ఆర్తితో ప్రార్థిస్తే, శ్రీ కృష్ణ విగ్రహం కనకదాసు నిలుచున్న పడమరవైపుకు తిరిగి, ఒక చిన్న గవాక్షం ఏర్పడి కనకదాసుకు దర్శనమిచ్చిందట!

ఈ ఆలయంలో జరిగే ప్రధానమైన ఉత్సవాలు సప్తోత్సవం అనే ఏడురోజుల ఉత్సవాలు జనవరిలో, శ్రీ మధ్వులు అంతర్ధానం అయిన రోజున మధ్వనవమి, శ్రీ కృష్ణ జయంతి, ఉత్థాన ద్వాదశినాడు లక్ష దీపోత్సవం, పర్యాయమహోత్సవం.

9. పూర్ణప్రజ్ఞుల రచనలు

పూర్ణప్రజ్ఞులు తమ సుదీర్ఘ జీవితంలో ద్వైతమత సిద్ధాంతం మీద అపార సాహిత్యాన్ని సృష్టించారు. బ్రహ్మసూత్రాల మీద నాలుగు గ్రంథాలు వ్రాశారు. మొదటిది సూత్రభాష్యం. ఇది సంక్షిప్తంగా, పొంకంగా ఉండే వ్యాఖ్యానం. తరువాతిది అనువ్యాఖ్యానం. ఇది

1900 శ్లోకాలలో ఉన్న గ్రంథం. దీనిలో ఇతర సిద్ధాంతాలను వేద ప్రమాణాలతో తార్కికంగా వాదనా పటిమతో ఖండించడం జరిగింది. దీనిమీద జయతీర్థులు న్యాయసుధ అనే వ్యాఖ్యానం సరళమైన శాస్త్రభాషలో వ్రాశారు. మూడవది బ్రహ్మసూత్రాల మీద అనుభాష్యం. ఇది బ్రహ్మసూత్ర సారాన్ని పారాయణకనువుగా ఉండేటట్లు వ్రాయబడిన గ్రంథం. బ్రహ్మసూత్రాలమీదే న్యాయవివరణ అనే గ్రంథం మరొకటి. ఇందులో సూత్రాలు అధికరణాలుగా విభజింపబడ్డాయి. ఆనందతీర్థులు పది ఉపనిషత్తుల మీద భగవద్గీత మీద భాష్యాలు వ్రాశారు. వీరి మహాభారత తాత్పర్య నిర్ణయం అనే గ్రంథం ప్రసిద్ధమైనది. ఇలా భాష్యాలు, స్వతంత్ర రచనలు, కీర్తనలు మొత్తం ముప్పైఏడు లభిస్తున్నాయి.

10. దాససాహిత్యం

శ్రీ మధ్వుల శ్రీ కృష్ణ భక్తి తత్త్వం తదనంతరం దాస సాహిత్య సృష్టికి దారి తీసింది. అనేక మంది కృష్ణ భక్తి పరంగా అద్భుతమైన కీర్తనలు వ్రాసి గానం చేశారు. అలాంటి వారిలో ప్రముఖుడు పురందరదాసు. కన్నడంలో ఈయన సృష్టించిన సాహిత్యం ఆపాతమధురం భక్తిరసామృతం. తరువాత జగన్నాథదాసు, కనకదాసు, విజయదాసు మొదలైన వారున్నారు. కనకదాసు మందిరం ఉడుపి శ్రీ కృష్ణాలయంలో ఉంది.

2వ అధ్యాయం

1. ద్వైతసిద్ధాంతం

ద్వైత సిద్ధాంతం, ప్రధానంగా అద్వైతాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. విశిష్టాద్వైత సిద్ధాంతాలతో కొంత సారూప్యం ఉండడం వల్ల శ్రీ మధ్వులు ఆ సిద్ధాంతాన్ని ఎక్కడా విమర్శించలేదు.

ద్వైతంలోని ప్రధానాంశాలు (1) జగత్తు సత్యం; (2) జీవుడు, బ్రహ్మము ఒకటి కాదు–వేరు వేరు తత్త్వాలు; (3) పరమాత్మ సగుణ సాకారుడు; (4) శ్రీ మహావిష్ణువు పరమ దైవము; (5) మోక్షానికి అచంచల భక్తి మాత్రమే ఏకైక మార్గము, అనేవి. ఇవన్నీ అద్వైతానికి పూర్తిగా వ్యతిరేకం, విశిష్టాద్వైతానికి పూర్తిగా వ్యతిరేకం కాదు. శ్రీ మధ్వుల నాటికి అనేక అస్తిక సిద్ధాంతాలు ఉన్నా, వాటిని దేనిని ఇసుమంతయైనా అనుసరించకుండా పూర్తిగా స్వతంత్రించారు.

మధ్వమత సారసంగ్రహంగా శ్రీ వ్యాసరాయలు రచించినట్లు చెప్పే ఈ శ్లోకం ప్రసిద్ధం:

శ్లో॥ శ్రీ మన్మధ్వమతే హరిః పరతరః సత్యం జగత్, తత్త్వతో
భిన్నా జీవగణాః హరేరనుచరాః నీచోచ్చభావం గతాః।
ముక్తిర్నైజ సుఖానుభూతిః, అమలాభక్తిశ్చ తత్సాధనం
హ్యక్షాదిత్రితయం ప్రమాణం, అఖిలామ్నాయైక వేద్యోహరి॥

(1) శ్రీ మహావిష్ణువే సర్వస్వతంత్రుడైన పరమ దైవం, (2) విశ్వం సత్యం, (3) జీవాత్మ పరమాత్మ వేరు, అలాగే జీవాత్మలు

కూడా పరస్పరం వేరు, (4) జీవులు పరమాత్మకు దాసులు, (5) వారిలో ముక్తియోగ్యులు, నిత్య సంసారులు తమోయోగ్యులు అనే తారతమ్యాలున్నాయి, (6) మోక్షమనగా పరమాత్మ స్వరూపానందం, (7) దానికి నిర్మలభక్తి ఏకైక మార్గం, (8) ప్రత్యక్ష, అనుమాన, ఆగమ ప్రమాణాలనే మూడే ప్రమాణాలు, (9) వేదార్థం శ్రీహరి మాత్రమే.

పై శ్లోకంలోని ఒక్కొక్క అంశం ద్వైతంలోని ఒక్కొక్క ప్రధానమైన విషయాన్ని తెలియజేస్తుంది. వాటిని నవరత్నాలన్నారు. ఈ శ్లోకాన్ని నవరత్న మాలిక అన్నారు.

పై శ్లోకాన్ని శ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రి గారు తమ సంస్కృత వాఙ్మయ చరిత్ర – లౌకిక వాఙ్మయ భాగంలో ఇలా అనువదించారు:

"సత్యము జీవాత్ముండును, సత్యం బీశ్వరుఁడు సకలసద్గుణుఁడతఁడౌ,
సత్యము వీరికి భేదము, సత్యము భేదంబు జీవజడముల కరయన్,
జీవుఁడస్వతంత్రధావుండు, విష్ణువు సుస్వతంత్రుఁ డతనిసుగుణములను
పొగడి యతనికరుణఁ బొందినజీవుండు, హరిసమీపమేగునదియెముక్తి."

2. శ్రీ మహావిష్ణువు

ద్వైతంలో శ్రీ మహావిష్ణువే సర్వోత్తముడు. సర్వోత్తమత్వాన్ని శ్రీ మధ్వులు ఇలా నిర్వచించారు. "ఏకః సర్వోత్తమో జ్ఞేయః ఏక ఏవ కరోతి యత్" అంటే సర్వోత్తముడే స్వతంత్రముగా కార్యాలను

చెయ్యగలవాడు, చేయించగలవాడు. ఆయన ఎవ్వరిమీద ఈ విషయంలో ఆధారపడనవసరంలేదు." అని అర్థం. ఆయన ఏ పనినైనా చేయగలడు (కర్తుం), చేసినదానిని వెనుకకు మరల్చగలడు (అకర్తుం), అదే పనిని ఇంకొక విధంగా చేయగలడు (అన్యథా కర్తుం). సర్వోత్తముడు అంటే ఆ బ్రహ్మమే. ఆయనలోనే అన్ని తత్త్వాలు ఇమిడి ఉన్నాయి. ఆయన అన్నింటికి అతీతుడు. ఈ విశ్వం ఆయన సృష్టి, ఆయన అభివ్యక్తి. ఆయన అనంత కళ్యాణ గుణసమన్వితుడు. అజ్ఞానాది దోషరహితుడు. ఆయన ఎనిమిది కార్యాలకు అధిష్ఠాత, అవి: (1) సృష్టి (creation), స్థితి (maintenance), లయం (dissolution), నియమనము (control), జ్ఞానము ఇచ్చుట(giving knowledge), అజ్ఞానము కలిగించుట (ignorance), బంధము (bondage), మోక్షము (salvation).ఆయన ఈ కార్యాలన్నీ స్వతంత్రంగా నిర్వహిస్తున్నాడు:

శ్లో॥ స్వతన్త్రమస్వతన్త్రంచ । ద్వివిధం తత్త్వ ముచ్యతే ।
స్వతన్త్రో భగవా న్విష్ణుః । నిర్దోషో -శేష సద్గుణః॥

స్వతంత్రుడు శ్రీమహావిష్ణువు ఒక్కడే. ఆయనకు భిన్నమైనవన్నీ అస్వతంత్రాలే. ఆయన దోషరహితుడు, కళ్యాణగుణాకరుడు అని సర్వదర్శన సంగ్రహంలో సాయణ మాధవాచార్యులన్నారు. భగవద్గీతలో భగవానుడే ఇలా అనుగ్రహించాడు.

శ్లో॥ యోమామేవమసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్।
స సర్వవిద్భజతి మాం సర్వభావేన భారత ॥ (15.19)

ఓ అర్జునా! జ్ఞానియైనవాడు ఈ విధముగా తత్త్వతః పురుషోత్తమునిగా తెలుసుకొనును, వాసుదేవుడైన నన్నే సర్వదా పరమేశ్వరునిగా భజించును. శ్రుతులు కూడా ఆయన పురుషోత్తముడని కొనియాడాయి. ఆయన శరీరం ప్రాకృత శరీరం కాదు. ఆయనలో ప్రాకృత గుణాలూ లేవు. ఆపాదమస్తకం జ్ఞానానందకరమైన దివ్యశరీరం ఆయనకుంది. రూప, రస, గంధాలను గ్రహించే శక్తిగల ఇంద్రియాలున్నాయి. ఆయనలోని కళ్యాణ గుణాలు ఆయన దివ్యాత్మస్వరూపం కంటే వేరుకావు. ఆయన పరిపూర్ణులు. ఆయన అనేక అవతారాలను కూడా దాల్చాడు.

శ్లో॥ బ్రహ్మశివస్సురేశాద్యాః శరీర క్షరణాత్ క్షరాః।
లక్ష్మీ రక్షర దేహత్వాత్ అక్షరా తత్పరో హరిః ॥

క్షరాక్షరములకు అతీతుడు పురుషోత్తముడు. ఆయన పరమాత్మ, నాశరహితుడు, అని సాయణ మాధవాచార్యులన్నారు.

ఇలా శ్రీ మహావిష్ణువు పురుషోత్తముడని, ఆయన సాకార, సగుణుడని నిరూపించి శ్రీ మధ్వులు ఆయనే ఆరాధ్యుడని బోధించారు.

అయితే ఇక్కడొక విషయం వివరించాలి. విశిష్టాద్వైతుల వలె శ్రీ మధ్వులకు శివుడంటే వ్యతిరేక భావం లేదు. పరమశివునకు భారతదేశంలో అపారమైన ఆదరణ ఉన్న విషయం ఆయన గుర్తించారు. దీనికి తోడు ఆయన స్వయంగా షివల్లి శైవ కుటుంబంలో జన్మించి ఉండవచ్చునుకూడ. దక్షిణ కవరా దేశంలో చంద్రమౌళే శ్వరుడుగా, అనంతేశ్వరుడుగా, శివుడు అనేక దేవాలయాలలో

ఆరాధించబడడం ఆయన చూశారు. అందుచేత మధ్వ సిద్ధాంతంలో శివునికి అత్యున్నత స్థానం– అంటే చతుర్ముఖబ్రహ్మ, వాయుదేవుడు, వారి దేవేరుల తరువాత కల్పించబడింది. అందుచేత శివునికి వ్యతిరేకంగా మధ్వమతంలో ఎక్కడా ఏ రచనలలోనూ లేదు. ఈ విషయాన్ని శ్రీ పద్మనాభాచార్ వారి “శ్రీ మధ్వాచార్య, వారి జీవితం, సందేశం” అనే గ్రంథంలో (పేజి 285) వివరించారు.

మధ్వులు వాయుదేవుని అవతారమైన హనుమంతుణ్ణి, ప్రహ్లాదుని అవతారమైన శ్రీ రాఘవేంద్రస్వామిని విశేషంగా ఆరాధిస్తారు. ఇప్పటికి హనుమంతుని దేవాలయాలలో మధ్వులే పూజారులుగా ఉంటున్నారు. దీనికి కారణం వారిద్దరు పరమ విష్ణుభక్తి తత్పరులు కావడం వల్లే. అంతేకాకుండా హనుమంతుడు, శ్రీ మధ్వులు కూడా వాయుదేవుని అవతారాలు.

3. విశ్వం సత్యం

శ్రీ శంకరులు విశ్వం మిథ్య అన్నారు. మరి విశ్వం ప్రత్యక్షంగా గోచరిస్తుంది. ప్రత్యక్ష ప్రమాణం అన్ని ప్రమాణాలలోనూ ఉత్తమమైనది. అలాంటపుడు విశ్వం మిథ్య అనడం ప్రమాణ విరుద్ధం కదా అనే ప్రశ్న వస్తుంది. దీన్ని అధిగమించడానికి ఆయన సత్యాన్ని మూడు విధాలుగా వర్గీకరించాడు. అవి ప్రాతిభాసిక సత్యము (త్రాడు మీద పామును ఆరోపించడం); వ్యావహారిక సత్యము (మనము వ్యవహరించే ఆది మధ్యాంతాలు గల విశ్వం); పారమార్థిక సత్యం (ఆదిమధ్యాంతాలు లేని పరమాత్మ). విశ్వానికి ఆదిమధ్యాంతాలు

ఉండడం చేత అది వ్యావహారిక సత్యమే గాని పూర్తిగా సత్యం కాదు. అందుచేత మిథ్య. అంటే వారి దృష్టిలో కొంతకాలం ఉండి నిష్క్రమించేవన్ని అశాశ్వతం గనుక అసత్యాలుగానే పరిగణించబడతాయి. శాశ్వతమైనదేదో అదే సత్యం. దీన్ని పురస్కరించుకుని ద్వైతులిలా ప్రశ్నిస్తారు; "మన తాత ముత్తాతలందరు కొంతకాలం జీవించి నిష్క్రమించారు. అందువల్ల వారంతా అసత్యమేనా? మిథ్యామాత్రులేనా?" అని. ఇలా అశాశ్వతమైన వన్నిటిని మిథ్య అనడం, అలా అనడాన్ని సమర్థించుకోవడం కోసం సత్యాన్ని మూడు విధాలుగా వర్గీకరించడం అశాస్త్రీయమని ద్వైత సిద్ధాంతం వాదిస్తుంది.

ఈ సిద్ధాంతం ప్రకారం వేదాలలో గాని, ప్రస్థానత్రయంలో గాని సత్యం మూడు విధాలుగా వర్గీకరించబడలేదు. ఇది శ్రీ శంకరుల స్వకపోల కల్పన గాని దీనికి శ్రుతి ప్రమాణం లేదు. అందుచేత ఆమోదయోగ్యం కాదు. అంతేకాకుండా భగద్గీతలో ఇలా ఉంది:

శ్లో॥ అసత్యమప్రతిష్ఠం తే జగదాహురనీశ్వరమ్ ।
అపరస్పర సంభూతం కిమన్యత్కామహేతుకమ్॥ (16.8)

పై శ్లోకంలో విశ్వం అసత్యం అనే వారు అసుర లక్షణం గలవారు అని చెప్పబడింది. తరువాతి శ్లోకంలో మిథ్యావాదులను ఖండించడం జరిగింది.

ఋగ్వేదంలో (2.7.3) 'విశ్వం సత్యం' అని స్పష్టంగా చెప్పబడింది.

పరమాత్మ ప్రకృతి నుపయోగించి విశ్వాన్ని రూపకల్పన చేస్తున్నాడు. ఆయన నిమిత్తకారణం. ప్రకృతి ఉపాదాన కారణం. పరమాత్మ స్వయంగా సృష్టించిన విశ్వాన్ని మిథ్య అనడం అపచారం. పరమాత్మ, ప్రకృతి నుపయోగించి సృష్టించిన విశ్వంలో తానుకూడా ప్రవేశించి అంతర్భూతుడై ఉంటున్నాడు. అలాంటి విశ్వాన్ని మిథ్య అంటే పరమాత్మను కూడ మిథ్య అనడమే అవుతుంది. వేదాలుకూడా మిథ్యే అవుతాయి.

పరమాత్మ, ప్రకృతి, జీవుడు–ఈ మూడు తత్త్వాలు శాశ్వతం, సత్యం. అలాగే ప్రకృతి నుపయోగించి పరమాత్మ సృష్టించిన విశ్వం సత్యం. 'మిథ్య' 'మాయ' అనే సిద్ధాంతాలకు తావులేదు.

తెలియబడేది, తెలుసుకొనేవాడు, తెలుసుకుంటే వచ్చే ప్రయోజనం, వీటి పరస్పర సంబంధం – దీన్ని అనుబంధ చతుష్టయం అంటారు. అంతా మాయే అయితే తెలుసుకొనేవాడూ ఉండడు, తెలియబడేది ఉండదు. లేని ప్రపంచాన్ని విరాగియై వదలి వెళ్ళిపోవడమూ ఉండదు. ఇలా ఆరంభంలోనే మాయావాదం భంగపడుతుంది. అంతా మాయే అయితే యజ్ఞయాగాదులెందుకు, పూజాదికాలెందుకు, తీర్థయాత్ర లెందుకు, పితృదేవతలకు ఆబ్దీకాలెందుకు, వేదాధ్యయనం ఎందుకు – ఇవన్నీ చూస్తూ ఉంటే మాయావాదం ప్రవచనానికి, గ్రంథాలకు పరిమితమేకాని, ఆచరణకు నోచుకోలేదు. అయితే ఇవన్నీ వ్యావహారిక సత్యాలంటారా, సత్యాన్ని వర్గీకరించడం శాస్త్ర సమ్మతం కాదు.

తన అవతార రహస్యాన్ని చెప్తూ పరమాత్మ భగవద్గీతలో (4.6) "సమ్భవామ్యాత్మ మాయయా" అని అన్నాడు. దీని అర్థం "నేను నా సంకల్ప బలంతో అవతరిస్తున్నాను" అని అర్థంకాని, ఏదో తన యోగమాయతోనో, మహిమతోనో అవతరిస్తున్నానని కాదు. మాయా శబ్దానికి పర్యాయపదాలు సూచించేదిగా ద్వైతులు ఈ శ్లోకాన్ని ఉదాహరిస్తారు.

శ్లో. **మహామాయేత్యవిద్యేతి । నియతిర్మోహినీతి చ ।**
ప్రకృతి ర్వాసనేత్యేవ తవేచ్ఛానన్త కథ్యతే ॥

ఓ అనంతా! మహామాయ, అవిద్య, నియతి, మోహిని, ప్రకృతి, వాసన–అనే శబ్దాలన్నీ నీ ఇచ్ఛకు పర్యాయపదాలు. అందుచేత ఈ శబ్దాలన్నీ శ్రీ మహా విష్ణువు యొక్క జ్ఞాన విశేషాలుగానే తీసుకోవాలి. మాయ పరమాత్మలోని అచింత్యశక్తి (inconceivable power). తనలో అంతర్నిహితంగా, తన అధీనంలోనే ఉన్న ఈ శక్తితోనే ఆయన, సృష్టి, స్థితి, లయాలు చేస్తున్నాడు. జ్ఞానం, అజ్ఞానం కలిగిస్తున్నాడు. బంధం, మోక్షం కలిగిస్తున్నాడు. ఇవన్నీ ఆయన దైవీశక్తులు. వీటన్నిటికి మించి ఆయన కృపాసాగరుడు. ఆర్తులైన భక్తులను కాపాడుతాడు.

ఇన్ని అమోఘశక్తులతో పరమాత్మ ఈ విశ్వాన్ని సృష్టించి అందులో తానుంటూ నడుపుతూంటే ఈ విశ్వం మిథ్య అనడం అర్థరహితం అంటారు శ్రీ మధ్వులు.

4. జీవాత్మ, పరమాత్మ ఒకటి కాదు

జీవాత్మ, పరమాత్మ వస్తుతః ఒకటే అన్నారు శంకరులు. జీవాత్మ శరీరాన్ని ఉపాధిగా గ్రహించాడు గనుక, మనోబుద్ధుల సాంగత్యంతో తన స్వస్వరూపాన్ని మరచి, తాను ఈ శరీరమే అనుకుంటున్నాడు. కాని 'బ్రహ్మవిదాప్నోతి పరం' – తన స్వస్వరూపం తెలుసుకున్న వెంటనే బ్రహ్మమే అయిపోతున్నాడని ఆయన సిద్ధాంతం. తరువాత వచ్చిన రామానుజులు పరమాత్మ చేతనాచేతన వస్తువులన్నీ తన శరీరంగానే కలిగియున్నాడని అన్నారు. అంటే ఈ జీవులందరు ఆయన శరీరభూతులే అని ఆయన సిద్ధాంతం. పరమాత్మ–జీవుడు, వీరిద్దరూ పూర్తిగా వేరూకాదు, పూర్తిగా ఒకటీకాదు. వీరి అనుబంధం ఒక విశిష్టమైన అనుబంధం. అందుచేత విశిష్టాద్వైతం. ఇక శ్రీ మధ్వులు పూర్తిగా స్వతంత్రించి వీరిద్దరూ వేరు వేరు తత్త్వములు, పరమాత్మ ఎవ్వరిమీద ఆధారపడడు, తద్విరుద్ధంగా జీవాత్మ వేరుగా ఉంటూ పరమాత్మ మీద ఆధారపడినవాడే, అంటే పరతంత్రుడే తప్ప స్వతంత్రుడు కాదు అన్నారు. ఇది ద్వైతం. జీవాత్మ పరమాత్మల అనుబంధం, అద్వైతం నుంచి ద్వైతం దాకా ఇలా పరిణామం చెందింది. రామానుజులకు మధ్వాచార్యులకు మధ్యన నింబార్కుడు 'ద్వైతాద్వైత' సిద్ధాంతాన్ని ప్రవచించినా దానికి అనుయాయులు లేనందువల్ల ప్రసిద్ధం కాలేదు. ద్వైతం అంటేనే భేదం. ద్వైతం పంచభేదాలను ప్రతిపాదిస్తుంది.

శ్లో. జీవేశ్వర భిదాచైవ, జడేశ్వరభిదా తథా
జీవభేదో మిథశ్చైవ జడజీవభిదా తథా ।
మిథశ్చ జడభేదో యః, ప్రపంచో భేద పంచకః।
(సర్వదర్శన సంగ్రహం-సాయణ మాధవాచార్యులు.)

"ద్వైతం అయిదు భేదాలను అంగీకరిస్తుంది. అవి (1) జీవేశ్వరుల మధ్య భేదం, (2) జడేశ్వరుల మధ్య భేదం, (3) జీవులలో పరస్పర భేదం, (4) జడ–జీవుల మధ్య భేదం, (5) జడములలో పరస్పర భేదం"

శ్రీ మధ్వులు జీవేశ్వర భేద నిరూపణకి ముండకోపనిషత్తులోని ఈ మంత్రాలను శ్రుతి ప్రమాణంగా తీసుకుంటారు.

ద్వా సుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే ।
తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి
అనశ్నన్నన్యో అభిచాకశీతి ॥ (5.1)

సమాన గుణాలు కలిగి సఖ్యంగా ఉండే రెండు పక్షులు ఒకే వృక్షాన్ని ఆశ్రయించి ఉన్నాయి. అందులో ఒక పక్షి ఫలాలను తింటూ ఉంటే, రెండో పక్షి నిర్లిప్తంగా చూస్తూ ఉంది. ఇది వాచ్యార్థం. తాత్త్వికమైన వ్యంగ్యార్థం, రెండు పక్షులు అంటే ఇద్దరు చేతనులు. వారు ఆశ్రయించిన వృక్షం నశ్వరమైన శరీరం. ఫలాలనారగించే పక్షి కర్మ ఫలాల ననుభవించే జీవుడు. నిర్లిప్తంగా చూస్తూ ఫలాల నారగించకుండా ఉండే పక్షి ఈశ్వరుడు.

ఈ శ్లోకంలోని స్పష్టమైన ద్వివచన నిర్దేశం, కర్మ పరాధీనుడైన జీవునికి కర్మపరాధీనుడు కాని పరమాత్మకు భేదం నిర్దుష్టంగా సూచించబడింది.

సమానే వృక్షే పురుషో నిమగ్నః
అనీశయా శోచతి ముహ్యమానః
జుష్టం యదా పశ్యత్యన్యమీశం
అస్య మహిమానమితి వీతశోకః (5.2)

త్రిగుణాత్మక ప్రకృతి పరాధీనుడైన జీవుడు శరీరంతో తాదాత్మ్యం పొంది దుఃఖిస్తూ ఉంటాడు. ఎపుడైతే తనకంటె భిన్నుడైన స్వామియైన ఆ పరమాత్మ ప్రభావాన్ని సాక్షాత్కరింపజేసుకోగలుగుతాడో అపుడు ఈ సంసార దుఃఖానికి దూరమై ముక్తుడౌతాడు.

ఈ రెండు మంత్రాలలో జీవేశ్వరుల భేదాన్ని, జీవుడికి ముక్తి మార్గాన్ని స్పష్టంగా భోదించింది శ్రుతి. ద్వైతపరంగా ఉన్న ఈ మంత్రాలను అద్వైతపరంగా వ్యాఖ్యానించడానికి అద్వైత సిద్ధాంత వ్యాఖ్యాతలు చాల శ్రమపడిన మాట వాస్తవం. ఈ మంత్రాల విషయం ఇలా ఉంటే 'తత్త్వమసి' అనే ఛాందోగ్యంలోని మహావాక్యాన్ని ద్వైతపరంగా వ్యాఖ్యానించడానికి ద్వైతసిద్ధాంత ప్రవర్తకులూ అంతే శ్రమపడ్డారు.

'తత్త్వమసి' అనే మహావాక్యం జీవాత్మల అభేదాన్ని స్పష్టంగానే సూచిస్తూంది. దీన్ని అధిగమిస్తేగాని ద్వైతాన్ని నిరూపించలేం. ఈ మహావాక్యాన్ని శ్రీ మధ్వులు ఇలా వ్యాఖ్యానించారు.

శ్లో. **అహమిత్యపరోక్షంతు తచ్ఛబ్దో హ్యవిశేషతః।**

త్వంశబ్దశ్చాపరోక్షార్థం తయోరైక్యం కథం భవేత్ ॥

ఆదిత్యో యూప ఇతివత్ సాదృశ్యార్థాత్తు సాశ్రుతిః.

(సర్వదర్శన సంగ్రహం–శ్రీ సాయణమాధవాచార్య ప్రణీతం: ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారి వ్యాఖ్యానం– పేజి 257)

ఏ విశేషములేని 'తత్' శబ్దం ఎప్పుడూ పరోక్షార్థాన్నే బోధిస్తుంది. 'త్వం' శబ్దం ఎదుట నున్న వస్తువునే బోధిస్తుంది. పరోక్షంగా ఉండే పరమాత్మకు, ప్రత్యక్షంగా ఉండే జీవుడికి ఐక్యం ఎక్కడ నుండి వస్తుంది? 'ఆదిత్యో యూపః' అనే శ్రుతి వాక్యానికి సూర్యుడే యూపస్తంభం అని అర్థం చెప్తే ఎలా? దానర్థం యూపస్తంభం సూర్యుడు లాగా మెరుస్తూంది అని మాత్రమే. అలాగే పరమాత్మకు జీవాత్మకు సామ్యం ఏమిటంటే ఇద్దరూ చేతనులే. అంతేగాని స్వతంత్రుడు, సర్వవ్యాపకుడు అయిన పరమాత్మకు, అణుస్వరూపుడు పరతంత్రుడు అయిన జీవునకు స్వరూపైక్యం చెప్పరాదు. అందుచేత ఛాందోగ్యంలో ఉన్న **"ఐతదాత్మ్యమిదం సర్వం తత్సత్యం । స ఆత్మా । తత్త్వమసి శ్వేతకేతో"** అనే వాక్యాన్ని **"స ఆత్మా అతత్త్వమసి శ్వేతకేతో"** అని సవర్ణదీర్ఘసంధిని విడగొట్టి "అతత్త్వమసి" అని అన్వయిస్తే ఆ పరమాత్మ స్వతంత్రుడు సర్వజ్ఞుడు, నీవు అస్వతంత్రుడవు, అజ్ఞుడవు, అందుచేత నీకు ఆయనతో ఐక్యం లేదు అని చెప్పవచ్చు నని కొందరి వ్యాఖ్యాతల అభిప్రాయం. దీన్ని పురస్కరించుకొని, రాధాకృష్ణ పండితులిలా అన్నారు.

“ద్వైతార్థమును గల్పించి సమర్థించుటకు మధ్వాచార్యులు అనేక శ్రుతి వాక్యములకు శ్రమతో ప్రయత్నించి తన కనుగణ మొనర్పవలసి వచ్చినది. ‘తత్త్వమసి’ మహావాక్యమున కర్థము చెప్పుచు, నది జీవేశ్వరైక్యమును జెప్పదనెను. ఆత్మకు గల లక్షణములు మూలములో నీశ్వర లక్షణ తుల్యములే యని దాని యర్థము. ఈశ్వరాంశమే జీవాత్మయని ప్రకటించు వాక్యములకు నిదే యర్థము. శ్రుతి వాక్యముల నాతడింకొకక్రమములో జదువును. ‘స ఆత్మా తత్త్వమసి’ యను దానిని ‘స ఆత్మా అతత్త్వమసి’ యని చదివి ‘ఆత్మ నీవు కావ’ని చెప్పును. ‘అయమాత్మా బ్రహ్మ’ యనునది కేవల జీవాత్మస్తుతి వాక్యమగును, లేదా, ధ్యానోపయోగార్థ మంత్రమని యాత దర్థము చెప్పెను.”

(భారతీయ తత్త్వశాస్త్రము – Vol 5. P. 302) విద్వాన్ బులుసు వేంకటేశ్వరులు (తి.తి.దే. ప్రచురణ)

సిద్ధాంత కర్తలు శ్రుతివాక్యాలను తమ తమ సిద్ధాంతాల కనువుగా వ్యాఖ్యానించడం సర్వసాధారణం. అంతే గాక శ్రుతిలో అన్ని సిద్ధాంతాలను సమర్థించే వాక్యాలు అక్కడక్కడ ఉన్నాయి. అయితే సర్వస్వతంత్రుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు అయిన పరమాత్మకు, పరతంత్రుడు, అజ్ఞుడు అయిన జీవాత్మకు సారూప్యం చెప్పడం విడ్డూరంగానే కనిపిస్తుంది. ఈ దృక్పథంలో చూచినప్పుడు మధ్వుల ద్వైతవాదం సమర్థనీయమని చెప్పడానికి భగవద్గీతలోని ఈ క్రింది శ్లోకం బలం చేకూరుస్తుంది.

శ్లో. **మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే ।**
శ్రద్ధయా పరయోపేతాః తే మే యుక్తతమా మతాః ॥

పరమేశ్వరుడనైన నన్ను, ఏకాగ్రచిత్తంతో, శ్రద్ధాభక్తులతో నిరతరం భజిస్తూ నా సగుణరూపాన్ని ఆరాధించే భక్తులే యోగులలో శ్రేష్ఠులు అన్నాడు పరమాత్మ భక్తుడైన అర్జునునితో. ఈ శ్లోకంలో ఆరాధనీయుడు పరమాత్మ యని, ఆరాధించవలసినవాడు జీవుడని, ద్వైతభావం స్పష్టంగా గోచరిస్తుంది.

5. జీవుడు

ఇక మౌలికంగా జీవులంటే పరమాత్మకంటే భిన్నులైన జీవాత్మలు. వీరికి జ్ఞానం, ఇచ్ఛాశక్తి ఉంటుంది. వీరికి విషయాలను తెలుసుకోవడానికి కర్మలు చెయ్యడానికి, అనుభవించడానికి కావలసిన శక్తి ఉంటుంది. జీవాత్మ అణుప్రమాణంలో ఉన్నా శరీరం అంతా వ్యాపించే శక్తి గలది. తన్నుతాను తెలుసుకోవడానికి, ఇతరులను తెలుసుకోవడానికి కావలసిన శక్తి దానికుంటుంది. అది పరమాత్మ ప్రతిబింబం గనుక, ఆయన లక్షణాలైన ఆత్మ వికాసం, ఆనందం సంతరించుకున్నా, పరమాత్మపై ఆధారపడిందే తప్ప స్వతంత్ర తత్త్వంకాదు.

జీవాత్మలు అనంతం-పరస్పరం భిన్నం- ప్రకృతి జన్యమైన వస్తు సమూహం కంటె భిన్నం. దేనికి దానికే ప్రత్యేకత. దేహం కంటె మనోబుద్ధుల కంటె తాను వేరనే జ్ఞానం లేకపోవడం జీవాత్మకు గల అవిద్య. అది పరమాత్మ ఇచ్ఛవల్లే జనించింది. దానివల్లే సంసారబంధం, నిరంతర జననమరణాలు.

అద్వైతం జీవులను వర్గీకరించలేదు. కారణం జీవాత్మ, పరమాత్మ నిజానికి ఒకటే అన్నపుడు వర్గీకరణ పొసగదు. విశిష్టాద్వైతం స్వరూపైక్యాన్ని అంగీకరించదు గనుక ఆ సిద్ధాంతం జీవులను నిత్యులు, ముక్తులు, బద్ధులు అని వర్గీకరించింది. విశిష్టాద్వైతానికి, ద్వైతానికి కొంత సారూప్యం ఉన్నా ఈ వర్గీకరణలో విశిష్టాద్వైతులు చెప్పే నిత్యులు అనే వర్గాన్ని ద్వైతం అంగీకరించదు. విశిష్టాద్వైతంలో ఎప్పుడు సంసారంలో లేకుండా నిత్యం శ్రీ మహావిష్ణువు చెంతనే ఉండే గరుడాళ్వారు, ఆదిశేషుడు, విష్వక్సేనాదులు నిత్యులు. అయితే ద్వైతం వీరెవ్వరు నిత్యులు కాదంటుంది. లక్ష్మీనారాయణులిద్దరే నిత్యులంటుంది.

ద్వైతం జీవులను మూడు వర్గాలుగా విభజించింది. వారు ముక్తియోగ్యులు, నిత్యసంసారులు, తమో యోగ్యులు. ఇందులో ముక్తియోగ్యులను మళ్ళీ అయిదుగా విభజించారు. వారు దేవగణం, ఋషిగణం, పితృగణం, చక్రవర్తిగణం, మనుష్యోత్తమగణం. వీరందరు సాత్వికులు ముక్తియోగ్యులు. దేవగణానికి చెందినవారు బ్రహ్మ, గరుత్మంతుడు, ఆదిశేషుడు, అగ్ని, వాయువు మొదలైన వారు. ఋషిగణానికి చెందినవారు, నారదుడు మొదలైనవారు. జనకుడు, అంబరీషుడు మొదలైన వారు చక్రవర్తి గణానికి చెందినవారు. ఈ ముక్తియోగ్యులలో స్థావరాలైన వృక్షాలు, పశుపక్ష్యాదులు కూడా చేర్చబడ్డాయి. అయితే ఇవి ఏమి సాధనచేసి మోక్షం పొందుతాయి అనే ప్రశ్నకు, పరమాత్మయొక్క కృపా విశేషం వల్లే మోక్షం పొందుతాయని సమాధానం.

ముక్తియోగ్యులు భక్తితో శ్రవణం, మననం, నిదిధ్యాసల ద్వారా మోక్షాన్ని పొందుతారు. వీరు సదాచార సంపన్నులు, సత్ప్రవర్తన, అచంచల భక్తి కలిగి ఉంటారు.

కర్మలను చేస్తూ, సుఖదుఃఖాలననుభవిస్తూ జనన మరణవలయంలో చిక్కుకుని ఉండేవారు నిత్య సంసారులు. వీరు పుణ్యఫలానుభవానికి స్వర్గానికి, పాప ఫలానుభవానికి నరకానికి వెడుతూ ఉంటారు. మళ్ళీ జన్మిస్తూ ఉంటారు.

ఇక రాక్షసులు, మనుష్యాధములు, తమోయోగ్యులు. వీరెప్పుడు పాపకృత్యాలే చేస్తూంటారు గనుక నరకంలోనే ఉంటారు.

సత్వగుణ సంపన్నులు ముక్తియోగ్యులు, రజోగుణసంపన్నులు నిత్యసంసారులు, తమోగుణ సంపన్నులు తమో యోగ్యులు. పంచ భేదాలను వివరిస్తూ జీవులలో పరస్పర భేదం ఉంటుందని చెప్పడం జరిగింది. దీన్ని స్వరూప తారతమ్యం అంటారు. మళ్ళీ ఈ జీవులను మూడు వర్గాలుగా విభజించడం స్వరూప త్రైవిధ్య అంటారు. ఇది శ్రుతి సమ్మతం. శ్రీ మధ్వులు భగవద్గీతలోని ఈ క్రింది శ్లోకాన్ని వారి విభజనకు ప్రమాణంగా సూచిస్తారు.

శ్లో॥ ఊర్ధ్వం గచ్ఛన్తి సత్వస్థా
మధ్యే తిష్ఠంతి రాజసాః ।
జఘన్యగుణవృత్తిస్థా
అధో గచ్ఛన్తి తామసాః ॥

సత్త్వగుణము గలవారలు ఊర్ధ్వలోకాలను, రజోగుణము గలవారలు మనుష్యలోకమును, తమోగుణము గలవారలు అధోలోకమును (నరకమును) పొందుతున్నారు.

అయితే ప్రతి మానవుడిలో దైవత్వం ఉంటుందని, దాన్ని వికసింప జేసుకోవడానికి అవకాశం ఉండాలని, ఈశ్వర కృపకు తాననర్హుడు అంటే నైరాశ్యం చోటుచేసుకుంటుందని, ఉజ్జీవించడానికి చేసే పురుష ప్రయత్నం నిరర్థకమనే, విమర్శకు తావివ్వడం ఈ సిద్ధాంతంలో ఒక లోపమేనని రాధాకృష్ణ పండితులు విమర్శించారు. (భారతీయ తత్త్వశాస్త్రం-5-308)

అయితే తమోయోగ్యులకు నివృత్తి అనేది ఈ సిద్ధాంతంలో లేకపోవడం కొంత అసంతృప్తికి, విమర్శకు ఆరోజులలోనే దారితీసిందిగాని దీనికి శ్రీ మధ్వులు సయుక్తికంగానే సమాధానం చెప్పారు. తమోయోగ్యుల ప్రవృత్తి ఎప్పుడూ పాపకృత్యాలవైపుకే మొగ్గుచూపుతుంది. వాళ్ళ ప్రాకృతమైన గుణాన్ని ఎవ్వరూ మార్చలేరు. అలా మార్చడమంటే ఆ జీవాత్మను నాశనం చెయ్యడం క్రిందే వస్తుంది. స్వరూపాన్ని లేక స్వభావాన్ని మార్చడం అంటే దాన్ని నాశనం చెయ్యడమే. అలా మారుస్తే దాని స్థానంలో ఇంకొక జీవాత్మ వచ్చినట్టే లెక్క. అందుచేత పరమాత్మ అలాంటి పని చెయ్యడు. అంతేకాకుండా పరమాత్మ తమోయోగ్యులకు నిరంకుశంగా నరకప్రాప్తి పొందించడు. వాళ్ళు దుర్మార్గాలకు, పాపాలకు పాలయినప్పుడే నరకంలోకి తోస్తాడు. ఇలాంటి వాళ్ళమీద క్షమాబుద్ధిని ప్రదర్శించడు.

అలాచేస్తే అది ధర్మానికి వ్యతిరేకం అవుతుంది. అలా పాపులను శిక్షించడం శ్రీ మధ్వులకు ఆమోదయోగ్యమే అంటారు ద్వైత సిద్ధాంతంలో విశేష కృషి చేసిన శ్రీ పి. నాగరాజా రావుగారు. (Introduction to vedanta -P.194-Bharatiya Vidya Bhawan Publication) అందుచేత తమోయోగ్యులు వారి ప్రవృత్యాను సారం దుష్కార్యాలు చేస్తూనే ఉంటారు, పరమాత్మచేత శిక్షించబడుతూనే ఉంటారు – ఇది వాళ్ళ మార్చలేని స్వభావం – దానికెవ్వరు ఏమీ చెయ్యలేరు. వీరు భక్తి ప్రపత్తులతో మోక్షం పొందలేరా? అంటే అలా చెయ్యడం వారి ప్రవృత్తికే వ్యతిరేకం గనుక వారలా చేసే ప్రసక్తే లేదు అని ఈ సిద్ధాంతం ప్రవచిస్తుంది. రాయబారంలో దుర్యోధనుడిని అతని దుష్టప్రవృత్తి నుండి శ్రీకృష్ణ పరమాత్మ కూడా మార్చలేక పోయాడు కదా!

6. భక్తి

ఎప్పుడైతే పరమాత్మ సాకారుడు, సగుణుడు, పురుషోత్తముడు, జీవాత్మ పరాధీనుడు అని సిద్ధాంతీకరించారో, అపుడు పరమాత్మమీద భక్తి మాత్రమే ముక్తి సాధనమౌతుంది. ద్వైతం భగవద్గీతలోని ఈ శ్లోకం మీద ఎక్కువ ఆదరణ చూపిస్తుంది.

శ్లో॥ మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే।
శ్రద్ధయా పరయోపేతాః తే మే యుక్తతమా మతాః ॥ (12.2)

పరమేశ్వరుడనైన నాయందే ఏకాగ్రచిత్తులై, నిరతరము నా భజనధ్యానాదుల యందే నిమగ్నులై అత్యంత శ్రద్ధాభక్తులతో సగుణరూపమున నన్ను ఆరాధించు భక్తులే యోగులలో మిక్కిలి

శ్రేష్ఠులు అని పరమాత్మే ఉపదేశించాడు. దేహాభిమానులకు అవ్యక్తపరబ్రహ్మ ప్రాప్తి కష్టమని కూడా ఆయనే చెప్పాడు.

"శంకరు నద్వైత వాద మఖండ ప్రజ్ఞాఫలితమైనను, మతనిష్ఠనొసగజాలదని యాక్షేపణ గలదు. అతని నిర్గుణబ్రహ్మ మన హృదయములో నుజ్వల ప్రేమనుగాని భక్తినిగాని జనింపజేయజాలదు. ఎవ్వడు, నెన్నడు జూచి యుండనట్టియు జూడరానట్టియు, నెవ్వడు సమీపించుట కవకాశములేని జ్యోతిర్మయ స్వరూపము గలట్టియు నిర్గుణ బ్రహ్మమును మనమారాధింపజాలము. నిరాకార బ్రహ్మము మనయారాధన కనుకూలమగు రీతిని సాకార మయ్యెనని చెప్పబడెను... ఈ సగుణ బ్రహ్మము స్వచ్ఛ భక్తి పూజపాత్రుడు; ఆతడు మానవకోటి భయభక్తుల కుదాసీనత వహించు ధర్మసంబందములేని దైవముకాడు. ఆతడు రజస్సత్వ పరిపూర్ణుడై, ధర్మదయ నిధియై, సర్వజ్ఞత్వ, సర్వవాపిత్వ, సర్వశక్తి మతత్వములు గలిగి జగత్కర్తయు, భర్తయు ధర్మాధ్యక్షుడునై వ్యవహరించును" అని రాధాకృష్ణ పండితులు చెప్పిన వాక్యాలు శిరోధార్యాలు - (భా.త.శాస్త్రము- 180-181- తి.తి.డి. ప్రచురణ).

సిద్ధాంత త్రయంలో ఎన్ని పరస్పర వైరుధ్యాలున్నా భక్తి దగ్గర కొచ్చేసరికి ఏకమౌతున్నాయి. దీనికి తార్కాణం శంకరులు రచించిన భజగోవింద శ్లోకాలు, శ్రీ లక్ష్మీ నృసింహ కరావలంబన స్తోత్రం లాంటి వన్నీ త్రిమతాల వారికి ఆమోదయోగ్యం కావడమే.

పరమాత్మ అస్తిత్వాన్ని నిరూపించిన తర్వాత శ్రీ మధ్వులు ఆయన్ను చేరుకొనే మార్గం భక్తి అని చెప్పారు. మరి ఆ భక్తి ఎలా

జనిస్తుంది? అంటే పరమాత్మను దర్శించాలనే జిజ్ఞాస బలంగా ఉండాలన్నారు. మరి ఆ జిజ్ఞాస ఎలా వస్తుంది అంటే అది మనం సంపాదించగలం అని అనుకోకూడదు. దానికి భగవంతుని అనుగ్రహం కావాలని విశ్వసించి, ఆయనకు సంబంధించిన ఆధ్యాత్మ గ్రంథ శ్రవణం చెయ్యాలి, వాటిమీద మనసు, నిదిధ్యాస చెయ్యాలి. ఈ ప్రక్రియల ద్వారా జిజ్ఞాస, వైరాగ్యం, భక్తి వరుసగా వస్తాయి. అంటే ప్రయత్నం ద్వారానే పరమాత్మ అనుగ్రహం పొందగలం అని అర్థం. వైరాగ్యం వచ్చిన తర్వాత ఐహిక అనుబంధాల మీద ఆసక్తి తగ్గి పరమాత్మ వైపు పూర్తిగా దృష్టి మరలుతుంది. ఆయన మీద అచంచల విశ్వాసం, ఆయనే తనను రక్షిస్తాడనే నమ్మకం కలిగి ఆయనకు పూజాదికాలు చేస్తూ ఉంటాడు. అదే భక్తి. ఈ భక్తి రెండు విధాలుగా వ్యక్తమవుతూ ఉంటుంది. అది పరమాత్మ గురించిన విషయాలు అధ్యయనం చెయ్యడం, తాను తెలుసుకున్నవి ప్రవచనం చెయ్యడం, ఎప్పుడైతే అధ్యయన, అధ్యాపనాలు ఉన్నాయో జ్ఞానం ఉన్నట్లే కదా! అందుచేత శ్రీ మధ్వుల భక్తి, జ్ఞానంతో మిళితమైనదే అనేది నిర్వివాదాంశం.

శ్రీ మధ్వులు భాగవతంలోని భక్తిని ప్రవచించారు. అది తొమ్మిది విధాలని ఆయన చెప్పారు. దానికి ప్రహ్లాదోపాఖ్యానంలోని పోతన్నగారి ఈ ప్రసిద్ధ పద్యం చూడండి.

మ. తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్ చింతనం
బను తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు దైత్యోత్తమా.
(7.167)

సర్వాంతర్యామియైన శ్రీహరిని నమ్మి, మనోవాక్కాయాలచే ఆయన్ని ప్రేమించడం, ఆయన లీలలు వినడం, ఆయనకు దాసుడుగా ఉండడం, మ్రొక్కడం, పూజించడం, సేవించడం, తనలో ఎఱుక గలిగి ఉండడం, కీర్తించడం, ధ్యానం చెయ్యడం అనే తొమ్మిది భక్తి మార్గాలలో ఆ పరమాత్మను నమ్మి ఉండడం శ్రేయస్కరం అంటుంది భాగవతం. ఈ తొమ్మిది భక్తి మార్గాలనే శ్రీ మధ్వులు ప్రవచించారు.

భక్తికి ఇంద్రియ నిగ్రహం, ఏకాగ్రత ప్రధానం గనుక ఏకాదశి వ్రతాన్ని, చాతుర్మాస వ్రతాన్ని శ్రీమధ్వులు తప్పకుండా పాటించాలని ప్రవచించారు. మడి, ఆచారాలు కూడా ఆయన ఎక్కువగా పాటించారు.

"నామకరణం పుత్రాదీనాం కేశవాదినామ్నా వ్యవహారః సర్వదా తన్నామానుస్మరణార్థమ్'' పుత్రాదులకు కేశవాది భగవన్నామాలు పెట్టడడం వల్ల సదా విష్ణు నామ స్మరణం జరుగుతుందని ఆయన చెప్పారు.

శ్లో॥ దక్షిణేకరే విప్రో బిభృయాద్వై సుదర్శనం ।
సవ్యేన శంఖం బిభృయాత్ ఇతి బ్రహ్మ విదో విదుః ॥

మధ్వబ్రాహ్మణులు కుడి భుజమునందు చక్రమును, ఎడమ భుజమునందు శంఖమును ధరించ వలెనని వేదవేత్తలు చెప్పుచున్నారు. ఇవి ధరించేడప్పుడు పఠించవలసిన మంత్రాలు ఆగ్నేయ పురాణంలో ఉన్నాయి. ఈవిషయాలను సాయణ మాధవార్యులు చెప్పారు. (చూ. సర్వదర్శన సంగ్రహం- ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు. పేజి 247)

శ్రీ మధ్వులు నిత్య సంధ్యావందనం, దేవతార్చన, నైవేద్యం మొదలైన సదాచారాలను ప్రోత్సహించారు. ఇవి ఇప్పటికి మధ్వులు పాటిస్తున్నారు. శ్రీ మధ్వులు చెప్పినట్లు మన పిల్లలకు మన హిందూ దేవుళ్ళ పేర్లు పెట్టడం ఎంతైన అవసరం. ఈ సంప్రదాయం యాభై సంవత్సరాల క్రితం వరకు తప్పకుండా పాటించేవారు. ఇపుడు ఎవరికి అర్థంకాని, ఉచ్చరించలేని వికృతమైన నామకరణాలు చెయ్యడం సర్వసాధారణమై పోయింది. ఈ దుస్సంప్రదాయం పోవాలి.

7. మోక్షం

మోక్షం అంటే స్వర్గ సుఖం అని కొందరు అనుకుంటారు. స్వర్గసుఖం వేరు, మోక్షానందం వేరు. 'సుఖం' అంటే భౌతికమైనది. 'ఆనందం' అంటే మనో బుద్ధులను గూడా అధిగమించిన బ్రహ్మానందం. ఇది భౌతికంకాదు. స్వర్గ సుఖాలు భౌతికమైనవి. మనం చేసిన పుణ్యానికి ఎంత సుఖం వస్తుందో అంతే. తరువాత మళ్ళీ జన్మనెత్తవలసిందే – క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి. అంటే మనం సంపాదించిన పుణ్యాన్ని స్వర్గంలో ఖర్చు పెట్టేస్తున్నామన్నమాట. అందుచేత ఆ సుఖం అశాశ్వతం. అలాగే పాపకృత్యాల వల్ల నరకం సంభవిస్తుంది. పాప ఫలాన్నునుభవించిన తర్వాత మళ్ళీ జన్మ సంభవిస్తుంది. మానవుడుగా పుట్టి కర్మలు చెయ్యకుండా ఉండలేం గనుక వాటి ఫలితాలననుభవించి మళ్ళీ జన్మిస్తూంటాం. జీవుడు శాశ్వతం, శరీరం అశాశ్వతం. ఇలాంటి జనన మరణ క్లేశాలు లేని శాశ్వతానంద స్థితే మోక్షం అంటే. అది

భక్తివల్ల, శ్రీ మన్నారాయణుడి కృప వల్ల సంభవిస్తుంది. అపుడు కలిగేది అపరోక్ష జ్ఞానం – భగవంతుణ్ణి ప్రత్యక్షంగా దర్శించడం, ఈ అపరోక్షానుభూతే మానవుని గమ్యం.

ముక్త జీవులు వైకుంఠం చేరుకుంటారు. 'మధ్వవిజయం' లో నారాయణ పండితులు వైకుంఠాన్ని వర్ణించారు. భాగవత పురాణంలో ఈ వర్ణన ఉంది. ధర్మం మూర్తీభవించిన శ్రీ మన్నారాయణుడు తన దివ్య మంగళ స్వరూపంతో అక్కడ ఉంటాడు. భక్తులక్కడ దివ్య విమానాలలో విహరిస్తూంటారు. పూదోటలతోను, తులసి వనాలతోనూ, పక్షుల స్వరాలతోనూ శోభాయమానంగా ఉంటుంది. ముక్తులు అక్కడ శ్రీ మహావిష్ణువును కీర్తిస్తుంటారు. ఆయన చెంత శ్రీదేవి ఉంటుంది.

స్వరూపానుభవం ప్రాకృత శరీరంలో ఉన్నపుడు అవరోధించబడుతుంది. దీపానికి చుట్టూ ధూమం ఆవృతమైతే దీప ప్రకాశం గోచరించదు. అలాంటిదే ప్రాకృత శరీరం. ఇది కర్మలతో వస్తుంది. మోక్షదశలో శ్రీ మన్నారాయణుని అనుగ్రహంతో ఈ అవరోధం (ప్రాకృత శరీరం) పోతుంది. అపుడు వైకుంఠంలో స్వరూపానుభవం కలుగుతుంది.

మోక్షానుభవంలో తరతమ భేదాలున్నాయి. అవి సాలోక్యము, అంటే వైకుంఠములోనే ఉంటూ యథేచ్ఛగా విహరిస్తూ భోగాలననుభవించడం, సామీప్యము, అంటే భగవంతుని సమీపంలో ఉంటూ పరమానందాన్ని అనుభవించడం. సారూప్యము, అంటే

చతుర్భుజ శంఖచక్రాలతో భోగాలననుభవించడం, సాయుజ్యం అంటే భగవంతుని శరీర ప్రవేశం చేసి భోగముల ననుభవించడం.

విశిష్టాద్వైతంలో మోక్షానుభవం ముక్త పురుషులందరికి సమానంగానే ఉంటుంది. కాని ద్వైతంలో తారతమ్యం ఉంటుంది. ఇదొక ప్రధానమైన భేదం. జీవిత కాలంలో చేసిన భక్తి విశేషాలలో, సాధనలో ఉపాసనలలో ఉన్న తారతమ్యం మోక్షంలో కూడా ప్రతిబింబిస్తుంది. దేవతలు, ఋషులు, మనుష్యులు అందరు ఉపాసన చేస్తారు; అయితే దేవతల ఉపాసన అధికం, ఋషుల ఉపాసన అంతకంటే తక్కువ, మానవుల ఉపాసన ఇంకా తక్కువ. వీరిలో కూడా అందరి ఉపాసన ఒకే మాదిరిగా ఉండదు. ఉపాసకుని సాధనలో నున్న ఎక్కువ తక్కువల కనురూపంగానే భగవంతుని అనుగ్రహం కూడా ఉండడం న్యాయమే కదా!

ద్వైత సిద్ధాంతంలో మరొక ముఖ్యమైన విషయం లింగ భేదం మోక్షదశలో కూడా ఉండడం. స్త్రీలు స్త్రీలుగా, పురుషులు పురుషులుగా మోక్షదశలో కూడా ఉంటారు.

మోక్షదశలో తరతమ భేదాన్ని పురస్కరించుకొని రాధాకృష్ణ పండితులు "వ్యవహార ప్రపంచ భేదములను మనము పరమార్థ ప్రపంచమునకు కూడ ననుసంధించుటవలన నిట్టి సిద్ధాంతము లుదయించును" అని విమర్శించారు గాని మధ్వ సిద్ధాంతంమీద అపార పరిశ్రమ చేసిన డా॥ బి.ఎన్.కె. శర్మగారు వేరే విధంగా అభిప్రాయపడ్డారు. ఆయన దృష్టిలో 'ఈ అసమానత్వం మోక్షదశను వ్యవహార ప్రపంచ స్థాయికి దిగజార్చదు. వ్యవహార ప్రపంచంలో

అసమానతలు ఈర్ష్యాసూయలకు దారితీస్తాయి. మోక్షదశలో అలాంటి ఈర్ష్యాసూయలు ఉండవు' అని అభిప్రాయ పడ్డారు. ఈ విషయాన్ని శ్రీ పి. నాగరాజారావుగారు చెప్పారు. (ఇంట్రడక్షన్ టు ఇండియన్ ఫిలాసఫీ పే. 193). ఏ ఇద్దరు జీవులూ ఒకలా ఉండరనడం ద్వైతంలోని ప్రధానాంశం. పంచభేదాలలో ఇది వివరించబడింది గనుక ఇది మోక్షదశలో కూడా దీన్ని వర్తించడంలో తప్పులేదు. దానికి కారణం సాధనలోని తారతమ్యం గనుక న్యాయంకూడా ఉంది.

8. లక్ష్మీదేవి

జ్ఞానమార్గాన్ని ప్రతిపాదించిన అద్వైతంలో శ్రీ లక్ష్మీ ప్రసక్తేరాదు. భక్తిమార్గాన్ని ప్రతిపాదించిన విశిష్టాద్వైతంలోను, ద్వైతంలోనూ శ్రీ మహాలక్ష్మికి ప్రత్యేక స్థానం ఉంది. విశిష్టాద్వైతంలో ఆ తల్లి స్థానం అద్వితీయం, ఆమె శ్రీ మన్నారాయణుని వక్షస్థలంలోనే స్థిరనివాసం ఏర్పరచుకొని ఉంటుంది. పరమ దయామయి. ఆమె భక్తులను చేరదీసి శ్రీ మన్నారాయణుని కృపకు పాత్రులుగా చేయడంలో ఆమెది ప్రధాన పాత్ర. దీన్ని పురుషకారం అంటారు. ద్వైతంలో ఇలాంటి స్థానం ఆమెకు లేదు.

అయితే లక్ష్మీనారాయణులిద్దరు నిత్యముక్తులే, ప్రకృతి సంబంధంలేని వారే కాని పరమాత్మ సర్వ స్వతంత్రుడు. శ్రీ లక్ష్మీదేవి ఆయన ఆధీనంలోనే ఉంటుంది. ఆయనకంటె జ్ఞానం ఆమెకు కొంచెం తక్కువగా ఉంటుంది. ఆమె పరమాత్మకంటె వేరైనా, ఆయనతో ఆమెకూడా సర్వత్ర సంచరిస్తుంది. ముక్తి పొందిన జీవులు కూడా

ఒకప్పుడు సంసారంలో ఉన్న వాళ్ళే గనుక వారికంటె నిత్యముక్తురాలైన శ్రీ లక్ష్మీదేవి ఎక్కువ, ఆమెకంటె శ్రీ మన్నారాయణుడు ఎక్కువ. ఆమెది ప్రాకృత శరీరంకాదు. శ్రీహరి దివ్యత్వాన్ని ఆమెకు ప్రసాదించడంచేత ఏ రూపాన్నైనా ఆమె ధరించగలదు. ఆమె జీవులను, ప్రకృతిని శాసించగలదు.

9. ప్రమాణములు

జ్ఞాన సాధనాలనే ప్రమాణాలంటారు. వీటివల్ల తెలుసుకొనే వాటిని ప్రమేయాలంటారు. శ్రీ మధ్వులు ప్రత్యక్ష, అనుమాన, ఆగమ ప్రమాణాలను అంగీకరించారు. ఇందులో ప్రత్యక్షానికి ఆయన పెద్ద పీట వేశారు. కారణం ప్రత్యక్షంగా కనిపించే విశ్వం ఎట్టి పరిస్థితులలోనూ మిథ్య అనడానికి వీలులేదు గనుక. జీవుడు తన ఆత్మజ్యోతి నుండి వెలువడిన శక్తితో విశ్వాన్ని చూసి సాక్షీభూతుడవుతున్నాడు. గనుక ప్రత్యక్షానికి తిరుగులేదు, మిథ్యకు తావులేదని శ్రీ మధ్వుల సిద్ధాంతం. చిరుచీకటిలో త్రాడుమీద ఆరోపితమైన సర్పభ్రమను ప్రత్యక్షంగా కనిపించే విశ్వానికి అన్వయించడం అసంబద్ధం. అసలు పాము లేనే లేదు సరికదా ఆ భ్రమ కూడా త్రాడుమీద కాంతిపడగానే తొలగిపోతూంది. ఈ మిథ్యాజ్ఞానాన్ని 'అభినవ అన్యధాఖ్యాతి' అంటారు. మిథ్య విషయంలో శ్రీ మధ్వుల అభిప్రాయాన్ని సమీక్షిస్తూ రాధాకృష్ణ పండితులిలా అన్నారు.

"మిథ్యా దృశ్యములోని విషయాంశములు మిథ్యకావు. అవి

అనుభూత సత్యాంశములే. కొన్ని లోపములచే మనము చూచు వస్తువును సమగ్రముగా చూడక, దాని లక్షణములు కొన్నిగల వేరొక వస్తువు జ్ఞాపకమునకు వచ్చి, అదే ఇదియని పొరపడుదుము. ప్రతి మిథ్యాదృశ్యమునందును రెండంశము లుండును. ఒకటి యథార్థమైనది, రెండవది భావించబడినది. జగన్మిథ్యాభావమున కర్థమేమనగా నిజమైనదొకటి యుండగా దాని స్థానమున నింకొకటి చూచుచుంటిమనియే కాని, నిజమైన దేదియు లేదని యర్థము కాదు." (భారతీయ తత్త్వశాస్త్రము Vol. 5 P. 290. తి.తి.దే. ప్రచురణ). ఇలా మిథ్యావాద తిరస్కరణకు ఎక్కువ ప్రాధాన్యం ప్రత్యక్ష ప్రమాణం ఇస్తుంది గనుక శ్రీ మధ్వులు దానికి ప్రథమ స్థానం ఇచ్చారు.

దూరంగా కొండమీద పొగ కనిపిస్తే అక్కడ నిప్పు ఉందని ఊహిస్తున్నాం. మనం ఇంతకు ముందు నిప్పు నుండి పొగరావడం ప్రత్యక్షంగా చూశాం గనుక మన ప్రత్యక్ష అనుభవం మీదే ఆధారపడి ఉండడం వల్ల దీన్ని అనుమాన ప్రమాణం అంటున్నాం. ఈ అనుమానానికి ఆధారం మన పూర్వానుభవమే గనుక ఈ ప్రమాణాన్ని శ్రీ మధ్వులు అంగీకరించారు.

ఇక మన జ్ఞానేంద్రియాలకు గోచరించని విషయాలకు ఆగమ ప్రమాణమే శరణ్యం. అందుచేత శ్రీ మధ్వులు వేద ప్రమాణానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. అయితే వేదంలో నిరాకార నిర్గుణ బ్రహ్మాన్ని సూచించి వ్యావహారిక సత్యాన్ని సమర్థించే పాఠాలను శ్రీ మధ్వులు 'ఉపజీవికలు' అంటే ఇంకొక దాని మీద ఆధారపడినవి అన్నారు. సాకార, సగుణ బ్రహ్మాన్ని సూచించే పాఠాలను

‘ఉపజీవ్యములు’ అంటే ఆధారభూతములు అన్నారు. ఉపజీవికలు, ఉపజీవ్యాలమీద ఆధారపడి ఉంటాయి గనుక వాటికి సంజ్ఞా మాత్రమైన ప్రాధాన్యమే ఉంటుంది. ప్రత్యక్షంగా అనేకత్వంగా గోచరించే ఈ విశ్వాన్ని ఈ ఉపజీవికలు ఒప్పుకోవు. అయితే ఇది సాంకేతికమే, బహుత్వంలో ఏకత్వం సూచించడానికే అంటారు శ్రీ మధ్వులు. ఎప్పుడైతే ఏకత్వం అంటున్నారో బహుత్వం ఉన్నట్టు ఒప్పుకున్నట్టే కదా అంటారు విమర్శకులు.

10. ప్రమేయాలు

శ్రీ మధ్వుల సత్యవిచారం (ontology), పది ప్రమేయాలను ఒప్పుకుంటుంది. అది ద్రవ్యం (substance), గుణం (quality), కర్మ (activity), సామాన్య(class character), విశేష (particularity), విశిష్ట (the qualified), అంశి(the whole), శక్తి (power), సాదృశ్య (similarity), అభావం (negation).

1. ద్రవ్యం అంటే వ్యక్తమయ్యే ఉపాదాన కారణమైన ప్రకృతికి, ఆవిర్భవించే బ్రహ్మమునకు జీవుడు మొదలైనవాటికి ఆధారభూతమైనది. దీన్ని ఆరు విధాలుగా విభజించారు. అవి: విష్ణువు, లక్ష్మి, జీవులు, అవ్యక్తాకాశము, ఉపాదాన కారణమైన జడ ప్రకృతి, త్రిగుణాలు.

2. గుణాలు అనేకం – అవి భౌతికం మానసికం కూడా. పరమాత్మ మాత్రం అనంత కళ్యాణ గుణ సమన్వితుడు. ఆయనలో దోషాలుండవు.

3. కర్మ రెండు విధాలు, పాప కర్మ, పుణ్య కర్మ – వీటి ఫలితాలు వరుసగా దుఃఖం, సుఖం.

4. సామాన్యం అంటే అనేక వస్తువులలో ఉండే సామాన్య ధర్మం.

5. విశేషం – అనేది శ్రీ మధ్వుల ప్రత్యేక సిద్ధాంతం. ఒక బల్ల మరొక బల్లకంటె వేరు, బల్ల నేల కంటే వేరు – ఇలా ద్వైతాన్ని ఆయన సమర్థించడానికి ఆయన ప్రవేశపెట్టిన సిద్ధాంతం.

6. విశిష్టం – ఒక వస్తువు విశేష్యం. దాని గుణం విశేషణం, రెండు కలిస్తే విశిష్టం.

7. అంశి–అనేక భాగాలు కలిగిన వస్తువు అంశి. అనేక దారాలు గల వస్త్రం అంశి. పరమాత్మ అంశి, జీవాత్మ భిన్నాంశి.

8. శక్తి నాలుగు విధాలు. ఊహించ నలవికాని పరమాత్మ శక్తి, అర్చామూర్తిలో మంత్రపూతంగా ప్రవేశపెట్టబడిన శక్తి, కొన్ని అతీంద్రియ శక్తులు (త్రిమతా చార్యులకు ఇలాంటి శక్తులుండేవి) శాపానుగ్రహ శక్తుల వంటివి– వాక్శుద్ధి అనవచ్చు.

9. సాదృశ్యం – రెండు వస్తువుల మధ్య పోలిక.

10. అభావం – లేదనటం – ఇది నాలుగు విధాలన్నారు. ప్రాగ్భావం – ఒక వస్తువు పుట్టకముందు లేకపోవడం, ప్రధ్వంస భావం, ఒక వస్తువు నాశనమైన తరువాత లేకపోవడం, అన్యోన్యాభావం ఒక వస్తువులోని గుణం మరొక వస్తువులో లేకపోవడం, అత్యంతాభావం – అసలే లేకపోవడం.

11. ప్రకృతి

మూల ప్రకృతి సూక్ష్మదశలో ఇరువది నాలుగు తత్త్వాలను ఇమిడ్చుకుని ఉంటుంది. ఇవి, మహత్తు, అహంకారము, బుద్ధి, మనస్సు, పంచకర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచేంద్రియ విషయాలు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు), పంచభూతాలు (ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి). జీవేశ్వర ప్రవృత్తి వల్ల ఈ అవ్యక్త ప్రకృతి విశ్వంగా వ్యక్తమవుతుంది. ముందు ప్రకృతిలో గల త్రిగుణాలు తరువాత ఇరువది నాలుగు తత్త్వాలుగా వ్యక్తమవుతాయి. అందుచేత విశ్వంలో గల వస్తుజాలం అంతా జడ ప్రకృతి నుండి పుట్టినవే. ఈశ్వరుడు ఈ వస్తుజాలానికి రూప కల్పన చేసి వాటిలో అంతర్యామితంగా ఉంటాడు. అందుచేత ప్రకృతి ఉపాదాన కారణం అని ద్వైతం చెప్తుంది. అలా ప్రకృతి వ్యక్తమైనపుడు బహుత్వంగా, అవ్యక్తంలో ఏకరూపంగా ఉంటుంది.

ప్రకృతి విశ్వానికి ఉపాదాన కారణం గనుక, కార్యకారణ సంబంధాన్ని గురించి ద్వైత సిద్ధాంతం ఏమి చెప్తుందో కొంత తెలుసుకోవలసి ఉంది. మట్టి కుండగా మారుతుంది. అంటే కుండ మట్టిలో ఉంది కాని రూపు దిద్దుకోలేదు. కార్యం కారణంలోనే ఉంది. మట్టి కుండగా మారడాన్ని సత్కార్యవాదం అంటారు. న్యాయవైశేషికులు మాత్రం కార్యం కారణంలో ఉండదంటారు. దీన్ని అసత్కార్యవాదం అంటారు. సాంఖ్యులు కార్యం, కారణంలో సూక్ష్మరూపంలో ఉంటుందంటారు. అందుచేత సత్కార్యవాదాన్ని

అంగీకరించినట్లే. అయితే ఈ రెండు వాదాలను తిరస్కరించి ద్వైతులు 'సత్–అసత్–కార్యవాదాన్ని' ప్రవేశపెట్టారు. ఈ సిద్ధాంతం ప్రకారం కార్యం సత్ (ఉన్నది), అసత్ (లేదు) రెండూ కూడా నిజమే– అయితే ఒకే సమయంలో కాదు. కుండ తయారు కాకముందు మట్టి రూపంలో కారణంగానే ఉంది గాని కార్యంగా లేదు. తయారయిన తర్వాత అది కార్యంగానే ఉంటుంది తప్ప కారణంగా మాత్రం కాదు. అయితే ద్వైతం ఇతర సిద్ధాంతాల వలె నిమిత్త కారణాన్ని అంగీకరించింది.

12. ద్రవ్యములు - వాటి గుణములు

ద్వైతం అంటేనే భేదం. ఇంతకు ముందు పంచ భేదాలను వివరించడం జరిగింది. అయితే ద్వైతం ఒక అభేదాన్ని మాత్రం ఒప్పుకుంటుంది. ఒక ద్రవ్యం, ఉదాహరణకి సాంబ్రాణ ఉందనుకోండి దాని వాసన, పొగ సాంబ్రాణి కాదు – అవి సాంబ్రాణ నుండి వేరు అని ఇతర శాస్త్రకర్తలు అంటారు. అయితే ద్వైతులు ద్రవ్యం, దాన్ని ఆశ్రయించిన గుణ కర్మలు ద్రవ్యం కంటె వేరు కావంటారు. ఇవి ద్రవ్యంలోనే అంతర్భూతంగా ఉంటాయి గనుక వాటిని ద్రవ్యం నుండి వేరుగా చూడకూడ దంటారు. ఇదే సిద్ధాంతానన్నుసరించి శ్రీహరి, ఆయన దివ్యమంగళ స్వరూపం, ఆయన అనంత కళ్యాణ గుణాలు, బలైశ్వర్యాలు, అన్నీ ఆయన కంటె వేరు కావంటారు. శాస్త్ర రీత్యా ద్రవ్యం అధారం, దానిగుణ క్రియాదులు సంబంధిత ద్రవ్యాన్ని ఆశ్రయించి ఉంటాయి గనుక ఆధేయాలు. ఇలా ద్రవ్యానికి దాని గుణక్రియాదులకు ఆధారాధేయ సంబంధం

ఉంది గనుక అవి రెండు వేరుగాని ఒకటి కాదని శాస్త్రం. అలాంటప్పుడు ద్రవ్యం దాని గుణక్రియాదులు ఒకటే అనడం శాస్త్ర విరుద్ధం కదా అంటే దానికి సమాధానంగా ద్వైతులు సృష్టించబడిన ప్రతి వస్తువులో విశేషమనే సూక్ష్మ పదార్థం ఉంటుంది. గులాబీ పువ్వు తీసుకుందాం. దానిలోని ఎరుపురంగు, సువాసన విశేషాలు. అవి పువ్వుతోనే పుట్టాయి. అయితే ఈ విశేషాలను చూసి అవి పువ్వుకంటె వేరని అనుకుంటే అది పొరపాటు. పువ్వులేనిదే అవి లేవు, అవిలేకుండా పువ్వు ఉండదు. ఇది సృష్టి విశేషం గనుక ద్రవ్యం దాని గుణ క్రియాదులు విశేష పదార్థాలుగా నిత్య పదార్థం (గులాబీ పువ్వు)లోనే విడదీయ రానివిగా ఉంటాయి అని సిద్ధాంతీకరించారు.

13. శ్రీ మధ్వులు - ఒక వాస్తవ వాది

శ్రీ మధ్వుల కాలం నాటికే క్రైస్తవ మిషనరీలు ఉధృతంగా మత ప్రచారం చేస్తూ మత మార్పిడిలు చేస్తున్నారు. దీనికి తోడు తురుష్కుల దండయాత్రలలో వారి దౌర్జన్యం, హింస వర్ణనాతీతం. ఈ పరిస్థితులలో ఒక బలమైన మత విశ్వాసం ప్రజలలో కలిగించి, వారికి కూడా తమకంటె వేరైన, ఆర్తిలో రక్షించే, సగుణ సాకార దైవం ఉన్నాడని, ఆయన మీద భక్తి తమను కాపాడుతుందనే విశ్వాసం కలిగించాలి. ఇలాంటి విశ్వాసం వేద విహితమైనదే గాని వేద బాహ్యం కాదు. నిర్గుణ, నిరాకార బ్రహ్మోపాసన బలమైన సామూహిక మత విశ్వాసాన్ని, అవసరమైన ప్రతిఘటనా భావాలను కలిగించలేదు. బాల గంగాధర తిలక్ సామూహిక వినాయక ఉత్సవాల ద్వారా

హిందూమత ఐక్యతకు దోహదపడ్డారన్నది అక్షర సత్యం. దాన్ని ఇప్పుడు అనేక చోట్ల నిర్వహిస్తున్నారు. మతం ప్రమాదంలో పడినప్పుడు, ధ్యానం పనికి రాదు, పరమాత్మమీద అచంచల భక్తితో శివాజీ మహరాజ్‌లా ముందుకు సాగాలి. భక్తి మాత్రమే ఈ ఆవేశాన్ని ఐక్యతను కలుగజేస్తుంది గాని జ్ఞానం మాత్రం కాదు. జ్ఞానమార్గం ఒక వ్యక్తికి పరిమితమౌతుంది. భక్తిమార్గం సమాజాన్ని ఏకంచేసి సామూహికంగా ఉత్సవాలను నిర్వహించడం ద్వారా సమాజాన్ని మతపరంగా ఐక్యం చేస్తుంది. శ్రీ మధ్వులు సమకాలీన పరిస్థితులలో ఈ ఐక్యత చాల అవసరం అని గుర్తించి ఉండవచ్చు. వేదాన్ని పరమ ప్రమాణంగా గ్రహించినా ఆయన పురాణేతి హాసాల మీద ఎక్కువగా ఆధారపడి, వీటిమధ్య సమన్వయం తీసుకు రావడానికి భారత, భాగవత, భగవద్గీతల మధ్య తాత్పర్య నిర్ణయ గ్రంథాలను రచించారు. యజ్ఞాలలో పశుబలిని నిషేధించారు. ఇలా వేద విహితమైన, బలమైన సిద్ధాంతాన్ని ప్రవచించి హిందూ సమాజాన్ని బలమైన శక్తిగా మార్చడం ఎంతైనా అవసరం అని గుర్తించారు. అయితే ఆయన మానవుని ఆధ్యాత్మిక ప్రగతికి, నైతిక ప్రవర్తనకి కూడా భక్తిమార్గమే ఏకైక మార్గం అని బోధించారు. అందుచేత ఆయన ఒక నవీనమైన, సృజనాత్మకమైన సిద్ధాంతాన్ని సృజించి అనూహ్య విజయం సాధించారు.

భక్తిమార్గం, జ్ఞానమార్గానికేవిధంగాను తీసిపోదని, నిజానికి భక్తిమార్గమే సామాన్య జనులకు అనుసరణీయమైన ఏకైక మార్గమని,

అదే సమాజాన్ని ఇతర మతాల దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సమాయత్త పరస్తుందని ఆయన దృఢ నిశ్చయం. వీరి కృషి ఫలితం పురందరదాసు వంటి వారు సృష్టించిన దాససాహిత్యం, వల్లభాచార్యుల వారి కృష్ణభక్తి, చైతన్య మహాప్రభు వంటి మహాభక్తుల కృష్ణతత్వ ప్రచారం – ఇదంతా భక్తిని హిందూమత సమైక్యతను సాధించాయి. ఇది సామాన్యమైన విజయం కాదు.

14. మధ్వ సిద్ధాంత సారస్వతం

మధ్వ సిద్ధాంతం మీద అపారమైన సారస్వతం ఉంది. శ్రీ పూర్ణప్రజ్ఞులే 37 గ్రంథాలను రచించారు. –వీటిని సర్వమూల గ్రంథాలంటారు. వాటిని మూడుగా వర్గీకరించారు– (1) వ్యాఖ్యానాలు, (2) స్వతంత్ర రచనలు, (3) కీర్తనలు. ఆయన భగవద్గీత మీద, ఉపనిషత్తుల మీద వ్యాఖ్యానాలు రచించారు. బ్రహ్మసూత్రాల మీద నాలుగు వ్యాఖ్యానాలు రచించారు. మొదటిది సూత్రభాష్యం, రెండవది అనువ్యాఖ్యానం. ఇది 1,900 శ్లోకాల గ్రంథం. దీనిలో ఆయన ఇతర సిద్ధాంతాలను ఖండించారు. అనుభాష్యం మూడవది – ఇది నిత్యం పారాయణ కనువుగా ఉండేలా సంక్షిప్తం చేసిన సూత్రభాష్యం. భగవద్గీత మీద, భారత, భాగవతాల మీద వ్రాసిన తాత్పర్య నిర్ణయ గ్రంథాలు ప్రసిద్ధాలు, ఋగ్భాష్యం, విష్ణుతత్త్వ నిర్ణయం, మాయావాద ఖండనం ఇతర గ్రంథాలు.

తరువాత జయతీర్థుల శ్రీ మధ్వులు బ్రహ్మసూత్రాల మీద వ్రాసిన అనువ్యాఖ్యానం మీద 'న్యాయసుధ' అనే గ్రంథం, బ్రహ్మసూత్ర

భాష్యం మీద తత్త్వ ప్రకాశిక, గీతాతాత్పర్య నిర్ణయం మీద న్యాయదీపిక, గీతాభాష్యం మీద ప్రమేయ దీపిక అనే వివరణ గ్రంథాలను రచించారు.

తరువాత వ్యాసరాయుల వారు న్యాయామృతం, తర్కతాండవం అనే గ్రంథాలు వ్రాశారు. శ్రీ రాఘవేంద్ర స్వామి న్యాయ సుధాపరిమళం అనే గ్రంథం వ్రాశారు.

మధ్వ సిద్ధాంతం మీద అపార సారస్వతం ఉంది. ఇక్కడ కొన్ని గ్రంథాలను మాత్రమే ప్రస్తావించడం జరిగింది.

15. ఇతర మధ్వ సిద్ధాంత కర్తలు

శ్రీ మధ్వుల అనంతరం అనేకమంది పీఠాధిపతులుగా, పండిత–రచయితలుగా ప్రసిద్ధి పొందారు. వారిలో ముఖ్యమైన వారి గురించి క్లుప్తంగా వివరించాలి. కారణం వారి కృషి ఫలితంగానే ఇప్పటికి మధ్వ సిద్ధాంతం బహుళ ప్రచారంలో ఉంది.

1) శ్రీ జయతీర్థులు

శ్రీ మధ్వులు తరువాత అంతటి ప్రాముఖ్యం గలవారు శ్రీ జయతీర్థులు. వీరు క్రీ.శ. 1340వ సంవత్సరంలో పండరిపురానికి చేరువలో గల 'కాగని' నది ఒడ్డున గల 'మంగళవేఢ' గ్రామంలో ఒక సంపన్న కుటుంబంలో జన్మించారు. తండ్రి రఘునాథరాయ దేశ్‌పాండె. చిన్నతనంలో గుఱ్ఱపుస్వారి చేస్తూ విలాసవంతమైన జీవితం గడిపారు. ఆయనకు సుమారు ఇరవై సంవత్సరముల

వయస్సులో శ్రీ మధ్వుల పరివ్రాజక శిష్యులలో ఒకరైన అక్షోభ్యతీర్థుల సాంగత్యం లభించింది. దీనితో ఆయన జీవిత దృక్పథం పూర్తిగా మారింది. అక్షోభ్యతీర్థుల ఆశ్రమంలోనే ఉంటూ సన్న్యసించి, ఆయన అంతరంగ శిష్యుడయ్యాడు. ఆయన వద్ద విద్యనభ్యసించి గురువును మించిన శిష్యుడయ్యాడు. అక్షోభ్యతీర్థుల అనంతరం ఆయన పీఠాన్ని జయతీర్థులే అలంకరించారు.

శ్రీ మధ్వులు బ్రహ్మసూత్రాల మీద రచించిన అనువ్యాఖ్యానికి అందరికి బోధపడేలా 'న్యాయసుధ' అనే వ్యాఖ్యానాన్ని, బ్రహ్మసూత్ర భాష్యానికి 'తత్త్వప్రకాశిక' అనే వ్యాఖ్యాన్ని అలాగే శ్రీ మధ్వుల 'గీతా తాత్పర్య నిర్ణయాని'కి 'న్యాయదీపిక', 'గీతాభాష్యా' నికి 'ప్రమేయదీపిక' అనే వ్యాఖ్యానాలను వ్రాశారు. వీటిలో న్యాయసుధకు అపారఖ్యాతి వచ్చింది. శ్రీ జయతీర్దులను 'టీకాచార్య' అనికూడా అంటారు. అది ఆయనకు బిరుదు కావచ్చు. 'ప్రమాణ పద్ధతి', 'వేదావళి', 'పద్యమాల' అనేవి ఆయన స్వతంత్ర రచనలు.

మధ్వ సిద్ధాంతంలోని ప్రధాన సూత్రాలను సుబోధకంగా, సరళమైన భాషలో (సంస్కృతం) వివరించడంలో ఆయనకాయనే సాటి అనే ఖ్యాతి సంపాదించుకున్నారు.

ఆయన శ్రీ విద్యారణ్య స్వామికి సమకాలికులు. క్రీ.శ. 1388లో ఆయన ప్రాకృత శరీరాన్ని విడిచారు.

గుల్బార్గా జిల్లాలోని 'మల్‌ఖేడ్'లో ఆయన బృందావనం ఉంది. అది మధ్వుల పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి పొందింది.

శ్రీ వేదభారతి

వేదశబ్ద పరిరక్షణకు, వేదవిజ్ఞాన ప్రచారానికి ఏర్పడిన ధార్మిక సంస్థ శ్రీవేదభారతి.

ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం అని పిలవబడే నాలుగు వేదాలకు సుమారు 1131 శాఖలు ఉండేవని మన ప్రాచీన గ్రంథాల ద్వారా తెలుస్తోంది. కాని నేడు 13 వేదశాఖలు మాత్రమే లభిస్తున్నాయి. ఈ 13 శాఖలలోను, 7 శాఖలకు మాత్రమే గురుశిష్యపరంపర కొనసాగుతోంది. మిగిలిన 6 శాఖలు పాక్షికంగా మాత్రమే లభిస్తున్నాయి. ఈ విధంగా మన ప్రాచీన భారతీయ విజ్ఞానంలో 99% పైగా పోగొట్టుకున్నాము.

వేద విజ్ఞానాన్ని అత్యవసరంగా పరిరక్షించుకోవడానికి శ్రీ వేదభారతి ఆధునిక కంప్యూటర్ టెక్నాలజీని ఎన్నుకొంది. అందులో - రికార్డింగ్ ద్వారా వేద మంత్ర ఉచ్చారణను జాగ్రత్త చేయడానికి కృషిచేస్తోంది. మిగిలి ఉన్న వేదశబ్దాన్ని రికార్డింగ్ చేస్తే సుమారు 3,000 గంటలు కావచ్చునని అంచనా వేయగా, ఇప్పటికి సుమారు 900 గంటలు పూర్తి అయింది. 200 పైగా ఆడియో/మల్టీమీడియా సిడిలరూపంలో అందుబాటులోనికి తీసుకొనివచ్చింది.

వేదాలపై శాస్త్రీయ పరిశోధన & ప్రచురణ :

వేదాలలో ఆధునిక శాస్త్రీయ సాంకేతిక విషయాలను వెలుగులోనికి తీసుకువచ్చే ప్రయత్నంలో "వేదంలో కంప్యూటర్ విజ్ఞానం", "వేదశాస్త్రాలలో ఆధునిక శాస్త్రీయ రహస్యాలు", "భూ కంపాలను ముందుగా పసిగట్ట గల్గుట సాధ్యమా?" మొదలైన అత్యున్నత శ్రేణి పరిశోధనా గ్రంథాలతో బాటు, "వేదగణితం" వంటి సిడి/డివిడిలను కూడా శ్రీవేదభారతి వెలువరించడం జరిగింది.

వైదిక గణితం బోధన :

టి.టి.డి. మరియు భక్తి టీ.వి. ఛానల్స్ ద్వారా లక్షలాదిమంది విద్యార్థులకు వేదగణితం, వేదవిజ్ఞానం వంటి విషయాలు పరిచయం చేయబడుతున్నాయి. విద్యార్థులకు అందుబాటులో ఉండేట్లుగా వైదిక గణితం ప్రచురించడం జరిగింది. ఈ కృషిని గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం **"బంగారు నంది"** బహుమతిని అందించింది.

అభ్యర్థన :

శ్రీ వేదభారతి చేస్తున్న కృషికి అందరూ చేయూతనందించవలసిందిగా ప్రార్థన!!!